# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**నేటి కందం-నేటికి అందం**

సరియన్నది లేని కరణి
గురుబోధనములను జేయు గుణులౌ నూటా
యిరువది ముగ్గురిని ప్రభుత
వరబోధకులనుచు నెంచి బహుమతుల నిడెన్ !!

(ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం విద్యా శాఖలోని నూటా ఇరవై మూడు మందికి బహుమతులను యిచ్చి సత్కరించింది).



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

రాజకీయ భ్రష్టత్వం
రాజ్యమేలే తరుణం
సిద్ధాంతం శిథిలమై
చితిలో కాలే భరణం.
తొలిగిస్తే నేతలను
తప్పులతో ఒక పార్టీ
కప్పదాట్లు ఐనానేమి
కౌగిలించే మరో పార్టీ.



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ ఆదివారం 6-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:30 పేజీలు:6 వెల: రూ.1/-


## పిల్లలు స్క్రీన్‌కు బానిసవుతున్నారు.. వారిని మైదానంలో ఆడించండి: టీచర్లతో ప్రధాని మోదీ





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:ఇవాళ జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం. జాతీయ టీచర్ అవార్డులు గెలిచిన వారితో ప్రధాని మోదీ మాట్లాడారు. ఢిల్లీలోని 7, లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గెలిచిన వారితో మాట్లాడుతూ.. పిల్లలు ఎక్కువగా స్క్రీన్‌కు బానిస అవుతున్నట్లు చెప్పారు. మొబైల్ ఫోన్లకు పిల్లలు హత్తుకుపోతున్నారన్న ఉద్దేశాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఒకవేళ క్రీడల పట్ల పిల్లలో ఆసక్తి పెరిగితే, అప్పుడు ఆ స్క్రీన్ బానిసత్వం నుంచి వాళ్లు బయటపడే అవకాశాలు ఉంటాయని ప్రధాని మోదీ అన్నారు. క్రీడలు అంటే వీడియో గేమ్స్ కాదు అని ఆయన స్పష్టం చేశారు. పిల్లల్లో సృజనాత్మక పెంచాలని, వారిలో ఆటల పట్ల ఆసక్తి పెంచేలా చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రోగ్రామ్‌లను డిజైన్ చేయాలని టీచర్లకు ప్రధాని సలహా ఇచ్చారు.

డ్రగ్స్ అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కొన్ని ప్రధాన నగరాలు, యూనివర్సిటీల్లో ఈ సమస్య ఉందని, కానీ దీని పట్ల సరైన అవగాహన లేదని, ఎటువంటి వివరణ లేకుండానే కొన్ని సార్లు ఆంక్షలు అమలు చేస్తున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తన పట్ల టీచర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వారిలో జరుగుతున్న బిహేవియర్ మార్పులను పరిశీలించాలన్నారు. యావత్ విద్యా వ్యవస్థకు తాను ఒక్క విషయాన్ని చెప్పాలనుకుంటున్నానని, కేవలం పాఠ్య పుస్తకాల బోధనలతో మాత్రమే కాదు, పిల్లలతో మమేకంగా కలిస్తేనే వారిలో మార్పు వస్తుందన్నారు. బాల్యాన్ని అంతం చేయవద్దు అని, ఆ బాల్యాన్ని రక్షించే సామర్థ్యం టీచర్లకు ఉందని, పిల్లలు సజీవంగా ఉండేందుకు కావాల్సిన చర్యలన్నీ చేపట్టడమే టీచర్ల బాధ్యత అని ప్రధాని మోదీ తెలిపారు.

## కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజుల్లో - నారాయణఖేడ్‌లో విస్తృత అభివృద్ధి

**-ఎంపీ సురేష్‌కుమార్ శేట్కర్.**
**-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి.**

సంగారెడ్డి సెప్టెంబర్ 05(నేటి నిజం ప్రతినిధి ) కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ సంబరాలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహం నుంచి రాజీవ్‌గాంధీ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్‌గాంధీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

### నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేని అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల్లోనే చేపట్టిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ అనేక హామీలను అమలు చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేయడం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల భారం వైపు నడిపించి, ప్రస్తుత ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడి మోపిందని అన్నారు.

### నారాయణఖేడ్‌కు 3,500 ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆనందం నెలకొన్నదన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ను కూడా మంజూరు చేయనున్నట్లు తెలి పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎన్ని ఇళ్లు మంజూరు చేశారో మాజీ పాలకులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

### ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు నిత్యావసర భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

### విద్యా రంగానికి భారీగా నిధులు

నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యా రంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

అదేవిధంగా రూ.47 కోట్లతో ఏటీసీ సెంటర్, రూ.5 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు చేయడంతో పాటు ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియం వంటి మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, యువతకు క్రీడా అవకాశాలు, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని తెలిపారు.

### రైతులకు రుణమాఫీ

రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లతో ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, వ్యవసాయ రంగానికి అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.

బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే విమర్శలు

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేపడుతుండటాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను స్వయంగా బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు.

ఎంపీ ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారని, బీఆర్ఎస్‌ను తిరస్కరించారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టాటా ప్రాజెక్టుతో బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 5: టాటా ప్రాజెక్టుతో బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సచివాలయంలో హైపర్వాల్ట్ ప్రతినిధుల బృందంతో సీఎం ఈరోజు (శనివారం) సమా వేశం అయ్యారు. దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదనపై సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ సామర్థ్యంతో టీసీఎస్, హైపర్‌వాల్ట్, భాగస్వామ్య సంస్థలు కలిపి ఈ ప్రాజెక్టులో రూ.70 వేల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నాయి. దీంతో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. టీసీఎస్ ప్రతినిధులతో సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

టాటా ప్రాజెక్టుతో తన కల నిజమైందని ఉద్ఘాటించారు. ఇంత పెద్ద ఇన్వెస్ట్‌మెంట్ తెలంగాణకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణకు ఇది మంచి గుడ్ న్యూస్ అని చెప్పారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను దావోస్‌లో కలిసి పెట్టుబడులు పెట్టాలని కోరామని ప్రస్తావించారు. టాటా, టీసీఎస్, హైపర్ వాల్ట్ చేపట్టిన వన్ గిగావాట్ డేటా సెంటర్ రూ.70 వేల కోట్ల భారీ పెట్టుబడి పెడుతోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో 7 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. త్వరలోనే కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్డు వేస్తామని అన్నారు. ఆ రేడియల్ రోడ్డును భారతరత్న రతన్ టాటాకు అంకితం చేస్తామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో చెప్పినట్లుగానే తాము చేస్తున్నామని అన్నారు. 2037 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడి పనిచేస్తున్నామని అన్నారు. ఏఐ అన్నింటినీ రీప్లేస్ చేస్తుందని.. కానీ బ్లూ కాలర్ జాబ్స్‌ను రీప్లేస్ చేయదని చెప్పారు. 2037 వరకు తామే తెలంగాణలో అధికారంలో ఉంటామని వెల్లడించారు. 2028 జూన్ 2వ తేదీన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. అదే విధంగా టాటా సంస్థ కూడా ప్రయత్నాలు చేయాలని సూచించారు. టాటాకు అవసరమైన అన్ని సదుపాయాలు, అనుమతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 7న ఆటో కార్మికులతో భేటీ : మంత్రి పొన్నం ప్రభాకర్

**సంక్షేమ బోర్డు, అగ్రిగేటర్ విధానం, మీటర్ ఛార్జీలపై చర్చ**
**రీట్రోఫిట్మెంట్‌కు రూ.1.50 లక్షల సాయం అంశంపైనా నిర్ణయం**



హైదరాబాద్, సెప్టెంబర్ 5: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొంటారని వెల్లడించారు. ఆటో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు.

గత నెల 23న ఆటో యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు తనను కలిసి డ్రైవర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. వారి జీవనోపాధికి, సంక్షేమానికి ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకునే దిశగా చర్చలు జరుపుతామని పేర్కొన్నారు.

సమావేశంలో ప్రధానంగా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు అంశంపై చర్చించనున్నారు. అలాగే అగ్రిగేటర్ విధానం, ఆటో కార్మికులు కోరుతున్న మేరకు మీటర్ ఛార్జీల పెంపు, డీజిల్, పెట్రోల్ ఆటోలను రీట్రోఫిట్మెంట్ చేసుకునేందుకు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఒక్కో అంశానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలు, వివిధ శాఖల పరిధి, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం తదితర అంశాలపై అధికారులు వివరాలు సమర్పించనున్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు ద్వారా కార్మికులకు మరింత భద్రత కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించనుంది. అగ్రిగేటర్ విధానంపై ఆటో సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, సూచనలతో పాటు ప్రస్తుత పరిస్థితులపై కూడా చర్చ జరగనుంది. మీటర్ ఛార్జీల పెంపుపై ఆటో కార్మికుల డిమాండ్‌ను పరిశీలించడంతో పాటు రీట్రోఫిట్మెంట్ కోసం ఆర్థిక సహాయం అందించే అంశంపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలని రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా శాఖ కమిషనర్, కార్మిక శాఖ కమిషనర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ తదితర ఉన్నతాధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఆయా శాఖల పరిధిలోని అంశాలపై సమగ్ర నివేదికలు, వివరాలతో సమావేశానికి రావాలని సూచించారు. దీంతో ఆటో కార్మికుల సమస్యలపై నిర్ణయాలు తీసుకునే ప్రక్రియకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మరోవైపు ఆటో యూనియన్ల జేఏసీ ప్రతినిధులకు సమావేశం గురించి సమాచారం అందించి, వారు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. కార్మిక సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని, వారి సమస్యలపై చర్చించిన అనంతరం తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. సెప్టెంబర్ 7న జరిగే ఈ సమావేశంపై రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాల్లో ఆసక్తి నెలకొంది.

## దేశ ప్రజలకు సమతుల్య పోషకాహారం అందేలా చూడటం అత్యంత కీలకం

**-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 5:వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించే క్రమంలో దేశ ప్రజలకు, ముఖ్యంగా పిల్లలు, కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య పోషకాహారం అందేలా చూడటం అత్యంత కీలకమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పోషకాహార లోపాన్ని కేవలం ఆహార సమస్యగా చూడకుండా.. రక్తహీనత, ఎదుగుదల లోపం, క్షీణత, తక్కువ బరువు, పెరుగుతున్న ఊబకాయం వంటి అనేక ఆరోగ్య సవాళ్లను సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

హైదరాబాద్‌లోని ఏవీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్‌లో సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు కేంద్ర సమాచార ప్రసార శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల పోషణ అవగాహన కార్యక్రమం ముగిసింది. 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2026లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ముగింపు వేడుకలకు కేంద్ర మంత్రి హాజరై మాట్లాడారు.

పోషకాహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి సమగ్ర పోషణ పథకం, సక్షమ్ అంగన్‌వాడీ-పోషణ్ 2.0, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన వంటి పథకాల ద్వారా పోషకాహార సమస్యను బహుముఖ విధానంతో పరిష్కరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ పోషకాహారం అందేలా ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఉద్యమం అవసరమని కేంద్ర మంత్రి అన్నారు. పోషకాహారంతో పాటు శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై యువతలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమం, నషా ముక్త్ భారత్ అభియాన్ వంటి కార్యక్రమాలను పోషకాహారంపై కొనసాగుతున్న ప్రయత్నాలతో అనుసంధానించడం ద్వారా ఆరోగ్యకరమైన, దృఢమైన, సవాళ్లను తట్టుకునే భారతదేశాన్ని నిర్మించవచ్చని చెప్పారు.

ఈ సందర్భంగా పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించేలా ఏర్పాటు చేసిన సమాచార ప్రదర్శనలను మంత్రి పరిశీలించారు. పోషకాహారంపై అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలు, సమాచార ప్యానెళ్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసార శాఖకు చెందిన సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోషకాహారం, ఆరోగ్యం, జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## సురేఖను కాపాడేందుకు చాలా ప్రయత్నించాం: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 5: తెలం గాణలో కొండా సురేఖ బర్తరఫ్ అంశం సంచలనం రేపిన విషయం తెలిసిందే. మంత్రి వర్గం నుంచి సురేఖ తొలగింపు, ఢిల్లీలో జరిగిన పరిణామాలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈరోజు(శనివారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయ త్నించామని తెలిపారు. సురేఖ విషయంలో అందరం తమవంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. కొండా సురేఖ బర్తరఫ్ పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని.. ఆమె విషయంలో హైకమాండ్ ఒప్పుకోలేదని టీపీసీసీ చీఫ్ అన్నారు.

ఇక, క్యాబినెట్ విస్తరణపై మాట్లాడిన మహేశ్.. ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లే అని స్పష్టం చేశారు. ఢిల్లీలో క్యాబినెట్ విస్తరణపై చర్చ జగలేదన్నారు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపైనే చర్చ జరిగినట్లు చెప్పుకొచ్చారు. క్యాబినెట్ విస్తరణపై హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. క్యాబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమన్నారు. 'నాకు మంత్రి పదవి అన్న ప్రచారంపై సమాచారం లేదు' అని వెల్లడించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారని టీపీసీసీ చీఫ్ అన్నారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశామని తెలిపారు. రాబోయే వంద రోజులు దేశ వ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తామన్నారు. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవం తం చేయాలని మహేశ్ గౌడ్ పిలుపునిచ్చారు.

## గ్రామాలకు తాగునీరు సాఫీగా అందేలా చర్యలు



హన్మకొండ, సెప్టెంబర్ 5:(నేటినిజం ప్రతినిధి)శాయంపేట మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా సాఫీగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను ఆమె పరిశీలించారు. ప్లాంట్ పనితీరు, నీటి సరఫరా విధానం, పరికరాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్లాంట్‌లోకి ముడి నీరు ఎక్కడి నుంచి వస్తోంది.. ప్రస్తుతం సరఫరా పరిస్థితి ఎలా ఉంది.. పంపులు సక్రమంగా పనిచేస్తున్నాయా.. నీటి క్లోరినేషన్ ఎలా జరుగుతోంది? గ్రామాల్లోకి నీటిని పంపిణీ చేసే వ్యవస్థ ఎలా ఉంది.. పంపింగ్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది.. తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. శాయంపేట మండలంలోని 24 గ్రామాలకు ప్రస్తుతం రోజుకు సుమారు 5.35 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు ఆమెకు వివరించారు.

పంపుల పరిస్థితిపై ఆరా

నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా.. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే వినియోగించేందుకు అదనపు పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలు సిద్ధంగా ఉన్నాయా.. అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో చిన్న సమస్య వచ్చినా గ్రామాలపై ప్రభావం పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లోపం తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ నీటి వనరులతో పాటు అదనపు పరికరాలను కూడా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు. తాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ పరిశీలనలో మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, డీఈలు చైతన్య, మధు, ఏఈలు రజిత, నాగరాజు, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రంజిత్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విజ్ఞాన సమపార్జన మూల సూత్రం పుస్తకం

## (06 సెప్టెంబర్ "జాతీయ పుస్తక పఠన దినోత్సవం" సందర్భంగా)

పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంథాలయమే. విజ్ఞాన సమపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మిన వాడు మహాజ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని వ్యతిరేకించిన వాడు నిక్కంగా అపర అజ్ఞాని అవుతాడు. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం. పుస్తకాలు కొలువుదీరి సరస్వతీ నిలయాలు గ్రంథాలయం మాత్రమే. గ్రంథాలయంలో పుస్తక దర్శనంతో మనో విస్తృతి విస్తరిస్తుంది, ప్రపంచం కళ్ల ముందు కదలాడుతుంది. పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 06 సెప్టెంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "జాతీయ పుస్తక పఠన దినోత్సవం (నేషనల్ రీడ్ ఏ బుక్ డే)"ను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. పుస్తకాలు చదవడం ఓ నిత్య అభిరుచిగా మారాలి. పుస్తకం చదవని రోజు మనసు కుదురుగా ఉండకూడదు. మనం చదువుకున్న రోజుల్లో పాఠ్య పుస్తకాలు చదువుతాం, ఉద్యోగ ఉపాధుల్లో మునిగినపుడు కూడా తీరిక సమయాల్లో పలు ఆసక్తికర పుస్తకాలను పఠించడం అనబడే అలవాటును కొనసాగించాలి. ఈ రోజున ప్రత్యేకంగా పిల్లలు లేదా సీనియర్ సిటిజన్స్ సమక్షంలో వారికి నచ్చిన కథలు లేదా ఆసక్తికర అంశాలకు సంబంధించిన పుస్తకాలను గట్టిగా చదివి వినిపించడం కూడా చేయవచ్చు. దీని వల్ల మనకే కాకుండా విన్న వారికి కూడా జ్ఞానం కొంత వరకైనా అబ్బుతుంది. పుస్తకాలు వెలకట్టలేని వినోదాలు, విజ్ఞానాన్ని అందించే ఉపకరణాలు, కాల యంత్రాలు కూడా. కామిక్ పుస్తకాలు, ఈ-పుస్తకాలు, ఆడియో పుస్తకాలు కూడా నేటి డిజిటల్ ప్రపంచంలో అందుబాటులోకి రావడం శుభపరిణామం. పిల్లలతో రోజు 10 నిమిషాలు కథల పుస్తకాలు చదవడంతో వారిలో ఆశావహ దృక్పథం క్రమంగా పెరుగుతుందని గమనించారు.

### లుక్ కల్చర్ వద్దు – బుక్ కల్చరే ముద్దు:

డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంథాలయాలు అనాథలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్ర చతురతలు అంతరించాయి. బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తకపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంథాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ దినోత్సవంలో భాగంగా మనకు నచ్చిన ఒక కొత్త పుస్తకాన్ని చదవడం, పుస్తక పాఠక ప్రేమికులను సన్మానించుకోవడం, పుస్తక పఠన ప్రయోజనాలు, రచయితలను గుర్తించడం, పుస్తక పఠనాన్ని నమ్మి ఉన్నత స్థితులకు ఎదిగిన మేధావులను సన్మానించుకోవడం, పుస్తక పఠనమే ప్రధాన అంశంగా విద్యాలయాల్లో పోటీలను నిర్వహించడం, పుస్తకాల విక్రయశాలల సందర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తిగత లైబ్రరీలను నెలకొల్పడం, పిల్లలచేత నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను ఈ దినోత్సవ వేదికగా నిర్వహించవచ్చు.

### పుస్తక పఠన ప్రయోజనాలు:

ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజీన్సు, పత్రికలు నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది. పుస్క పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం, మానసిక ఒత్తిడిని తగ్గడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తక ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం. పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుసేతక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి. మెదడు చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, శాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసనం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షనీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం, వ్యక్తిత్వ అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు అప్రయత్నంగా, సులభంగా పెరుగుతాయి.

నేటి ఆధునిక యువత గ్రంథాలయ దర్శనం చేస్తూనో లేదా నిదానంగా ఓ మూలన కూర్చొని అవసరం అనుకున్న పుస్తకాన్ని కొనుక్కొని పఠన ప్రపంచంలో మునిగిపోతూనో, జ్ఞాన సాగరం ఈదుతూ, ఎవరెస్టు శిఖరమంత ఎదుగుతూ, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన జ్ఞాన సంపన్నులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం, దానిలోని భావరసాన్ని మస్తిష్కంలో నింపుకుందాం.



-మధుపాలీ
9949700037

# రీసైకిల్, అప్‌సైకిల్ చేసిన వస్త్రాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు జీఈఎం, టెక్స్‌టైల్స్ కమిటీ మధ్య అవగాహన ఒప్పందం

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం), జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన టెక్స్‌టైల్స్ కమిటీ (టీసీ) కలిసి వినియోగదారుల వినియోగానికి ముందు, తర్వాత ఉత్పత్తయ్యే వస్త్ర వ్యర్థాలు, స్క్రాప్, సెకండ్‌హ్యాండ్ దుస్తులతో తయారయ్యే రీసైకిల్, అప్‌సైకిల్ ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా ప్రోత్సహించేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. దీని ద్వారా సర్క్యులర్ టెక్స్‌టైల్ ఆర్థిక వ్యవస్థలోని సంస్థలకు కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ముంబయిలో జరిగిన టెక్స్‌టైల్స్ కమిటీ 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయడంతో ఈ భాగస్వామ్యం అధికారికంగా అమల్లోకి వచ్చింది.

ఈ సహాకారం ద్వారా 'వ్యర్థాల నుంచి విలువ, విలువ నుంచి మార్కెట్' వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా వస్త్ర వ్యర్థాలు, స్క్రాప్, సెకండ్‌హ్యాండ్ దుస్తులను నాణ్యమైన విలువ జోడించిన ఉత్పత్తులుగా మార్చి, వాటిని జీఈఎం వేదిక ద్వారా ప్రభుత్వ కొనుగోలుదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం, రీసైకిల్, అప్‌సైకిల్ వస్త్ర ఉత్పత్తులను తయారు చేసే అర్హత కలిగిన ఉత్పత్తిదారులను టెక్స్‌టైల్స్ కమిటీ గుర్తించి, వారి అర్హతలను ధ్రువీకరించి, సర్టిఫై చేసి, గుర్తింపు ఇవ్వనుంది. అలాగే భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు, సామర్థ్య నిర్మాణం, మార్కెట్ పరిశోధన, సాంకేతిక ప్రమాణాల రూపకల్పనకు కూడా సహకరించనుంది.

జీఈఎం రీసైకిల్, అప్‌సైకిల్ వస్త్ర ఉత్పత్తుల కోసం ప్రత్యేక వర్గాలను ఏర్పాటు చేసి, విక్రేతల నమోదు, ఆన్‌లైన్ మార్కెట్ అనుసంధానాలను సులభతరం చేయడంతో పాటు, ఈ ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలుదారుల్లో ప్రోత్సహించనుంది. శిక్షణ, మార్గదర్శక సహాయం ద్వారా చివరి దశలో పనిచేసే అప్‌సైక్లర్లు, రీసైక్లర్లు ప్రభుత్వ కొనుగోళ్లలో సమర్థవంతంగా పాల్గొనేలా చేయనున్నారు.

ఈ భాగస్వామ్యంలో హబ్-అండ్-స్పోక్ విధానాన్ని అనుసరించనున్నారు. దీనిలో భాగంగా టెక్స్‌టైల్స్ కమిటీ, దాని అనుబంధ కార్యాలయాలు చివరి దశలోని అప్‌సైక్లర్లు, రీసైక్లర్లను చేరుకోవడం, వారిని సమీకరించడం, సామర్థ్య నిర్మాణం వంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ కొనుగోళ్లకు అనువైన ఉత్పత్తి ప్రమాణాలు, కేటలాగ్‌ల రూపకల్పనకు సహకరిస్తాయి.

మహిళలు, ఎంఎస్ఎంఈలు, స్థానిక సంస్థలు, చేతివృత్తుల కళాకారులు, రీసైక్లర్లు, ఇతర సర్క్యులర్ ఎకానమీ సంస్థలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, 'వోకల్ ఫర్ లోకల్', 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా సమగ్ర, వికేంద్రీకృత, సుస్థిర ఉత్పత్తి వ్యవస్థను నిర్మించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

ఈ కార్యక్రమానికి కేంద్ర జౌళిశాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, మహారాష్ట్ర ప్రభుత్వ జౌళిశాఖ మంత్రి శ్రీ సంజయ్ సవ్కరే హాజరయ్యారు. సీనియర్ అధికారులు, పరిశ్రమ ప్రతినిధుల సమక్షంలో జీఈఎం అదనపు సీఈఓ శ్రీ అజిత్ బి. చవాన్, టెక్స్‌టైల్స్ కమిటీ కార్యదర్శి శ్రీ కార్తికేయ్ ధండా ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ కీలక భాగస్వామ్యంపై సీఈఓ శ్రీ మిహిర్ కుమార్ మాట్లాడుతూ.. "ధ్రువీకరణ, ప్రమాణీకరణ, మార్కెట్ అందుబాటును అనుసంధానం చేయడం ద్వారా వస్త్ర వ్యర్థాలతో తయారయ్యే ఉత్పత్తులకు విశ్వసనీయమైన డిమాండును సృష్టించడం జీఈఎం-టీసీ భాగస్వామ్య లక్ష్యం. ప్రభుత్వ కొనుగోళ్లకు ఉన్న విస్తృత స్థాయి, పరిధి ద్వారా కార్యాలయాలు, సంస్థలు, బహుమతులు, ఇతర ప్రజా వినియోగ అవసరాల్లో ఇటువంటి ఉత్పత్తుల వినియోగాన్ని వేగంగా పెంచవచ్చు" అని అన్నారు.

ఈ కార్యక్రమం వనరుల సంరక్షణ, సుస్థిర జీవనోపాధి, బాధ్యతాయుత వినియోగం, ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, సర్క్యులర్, వనరుల సమర్థ వినియోగం ఆధారిత వస్త్ర ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ చేపడుతున్న మార్పును మరింత బలోపేతం చేయనుంది.

ప్రభుత్వ కొనుగోళ్ల విస్తృత స్థాయిని వినియోగించుకోవడం ద్వారా వస్త్ర వ్యర్థాలను ఆర్థిక అవకాశాలుగా మార్చడం, సుస్థిర మార్కెట్ వృద్ధిని సాధించడం దిశగా ఈ భాగస్వామ్యం ఒక కీలక ముందడుగుగా నిలుస్తుంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 5:ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు విద్యార్థులతో కలిసి శనివారం ఉట్నూర్ పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ, మండల అధ్యక్షుడు పంద్రా జైవంత్ రావు, మాజీ ఎంపీపీ ముచ్చినేని భూమన్న, మాజీ వైస్ ఎంపీపీ సలీమొద్దీన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

యూత్ డిక్లరేషన్‌లో యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ధరణి రాజేష్ ఆరోపించారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అజ్మీరా జయచంద్ర, కోలా సత్తన్న, సౌకత్ అలీ, మాజీ కోఆప్షన్ సభ్యులు ముజీబ్ ఖాన్, కాటం రమేష్, మునీర్, సిడం సోనేరావు, దూట మహేందర్, వసంత్, సత్యం, గిరి నాయక్, అన్వేష్, బొడ్డు నరేష్, సులేమాన్, కామెరి రాజు, సాజిద్, అలీం, అజయ్, సిరాజ్, అంజాద్, కలీం, మహేష్, శివ తదితరులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# భూభారతికి వ్యతిరేకంగా బీజేపీ మహాదీక్ష..




ఆదిలాబాద్, సెప్టెంబర్ 5:తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం నిర్వహించిన మహాదీక్షలో ఉట్నూర్ మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. భూభారతి చట్టానికి వ్యతిరేకంగా పార్టీ నిర్వహించిన ఆందోళనలో పాల్గొనేందుకు ఉట్నూర్ నుంచి నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన మహాదీక్షలో వారు పాల్గొన్నారు.

మహాదీక్షలో పాల్గొన్న వారిలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, ఉట్నూర్ మండల బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేష్ తదితర నాయకులు ఉన్నారు.

# త్రిపుర నుంచి ఎన్‌పీఓపీ ధ్రువీకరించిన 18 మెట్రిక్ టన్నుల బియ్యం ఆస్ట్రియా, నెదర్లాండ్స్‌కు ఎగుమతి.. సాయపడిన అపెడా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:నేషనల్ ప్రోగ్రాం ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీఓపీ) ధ్రువీకరించిన నాలుగు రకాలకు చెందిన 18 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని త్రిపుర నుంచి ఆస్ట్రియా, నెదర్లాండ్స్‌కు నిన్న, అంటే 2026 సెప్టెంబరు 2న ఎగుమతి కోసం రవాణా చేశారు. ఈ పనిలో అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ.. 'అపెడా') సాయపడింది. స్థానిక రైతులకు కొత్త మార్కెట్ల అవకాశాన్ని అందించడంతో పాటు వ్యవస్థీకృత, ఎగుమతి ప్రధాన ఉత్పాదన మాధ్యమం ద్వారా త్రిపురకు అంతర్జాతీయ మార్కెట్లతో జతపడే దిశలో ఈ ఎగుమతి సంబంధిత కార్యక్రమం ఓ ముఖ్య ఘట్టాన్ని ఆవిష్కరించింది.

ఎన్‌పీఓపీ ధ్రువీకరించిన సంప్రదాయ జాతికి చెందిన బియ్యం (కన్‌సైన్‌మెంట్)లో నాలుగు రకాలు ఉన్నాయి. అవి సుగంధ భరిత కాలీ ఖాసా బియ్యం, సుగంధ భరిత హరినారాయణ్ బియ్యం, బిరోన్ బియ్యం (తెల్లని అంటుకునే రకం బియ్యం), మైమీ హాంగా బియ్యం (నల్ల బియ్యం). ఈ బియ్యాన్ని త్రిపుర స్టేట్ ఆర్గానిక్ ఫార్మింగ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (టీఎస్ఓఎఫ్‌డీఏ) సాయం అందిస్తున్న త్రిపురకు చెందిన ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీల (ఎఫ్‌పీసీస్) నుంచి సేకరించారు. సోనేపటలోని ప్రథితి ఆర్గానిక్ ఫుడ్స్ ద్వారా ఈ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. భారతీయ ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పాదనలను ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేసే సంస్థల్లో ఓ అగ్రగామి సంస్థయే ఈ ప్రథితి ఆర్గానిక్ ఫూడ్స్.

ఈ కార్యక్రమం స్థానిక రైతులకు, ఎఫ్‌పీసీలకు అంతర్జాతీయ మార్కెట్లతో ముడిపడేందుకు ఒక అవకాశాన్ని ఇస్తోంది. అంతేకాదు, ధ్రువీకరించిన ఆర్గానిక్ ఉత్పాదనలకు ప్రపంచం అంతటా గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం రాష్ట్ర భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తోంది. ఈ ఎగుమతి అవకాశం దక్కడంతో, భాగస్తులైన రైతులకు దేశీయ మార్కెట్‌తో పోలిస్తే 40 శాతం ఎక్కువ ధర లభించగలదని భావిస్తున్నారు. ఫలితంగా రైతులకు సంఘటిత, ఎగుమతికి ఉద్దేశించిన ఉత్పాదన ప్రక్రియలో పాలుపంచుకోవడానికి ఆర్థికపరంగా గొప్ప ప్రోత్సాహం కూడా అందనుంది.

గత నెలలో త్రిపురలో అపెడా నిర్వహించిన కొనుగోలుదారులు, అమ్మకందారుల సమావేశాన్ని (ఆర్‌బీఎస్ఎమ్) ముందుకు తీసుకుపోవడం ఈ ఎగుమతి కార్యక్రమం ముఖ్యోద్దేశం. ఆసక్తి ఉన్న అంతర్జాతీయ కొనుగోలుదారులను, స్థానిక రైతులను ఒక చోటుకు చేర్చడంతో పాటు, మార్కెట్టు లభ్యతకు కావలసిన సంబంధాలను నెలకొల్పడంలో ఆర్‌బీఎస్ఎమ్ తోడ్పడింది.

కొనుగోలుదారు, అమ్మకందారుల ముఖాముఖి చివరకు రైతులు, ఎఫ్‌పీసీలకు బలమైన అంతర్జాతీయ వాణిజ్య అవకాశాలను అందించేదిగా మారగలదని ప్రస్తుత ఎగుమతి కన్‌సైన్‌మెంటు నిరూపించింది.

అంతర్జాతీయ మార్కెట్లలో నాణ్యతకు, ఆహార భద్రతకు, ధ్రువీకరణకు, సమాచారాన్ని సేకరించే సామర్థ్యానికి విలువను ఇస్తుంటారు. ఈ కోణంలో నుంచి చూసినప్పుడు, త్రిపురకు చెందిన ఎన్‌పీఓపీ ధ్రువీకరించిన బియ్యాన్ని ఆస్ట్రియా, నెదర్లాండ్స్‌కు ఎగుమతి చేయడం ముఖ్య ఘట్టం.

కన్‌సైన్‌మెంట్ రవాణాను త్రిపుర వ్యవసాయ మంత్రి శ్రీ రతన్ లాల్ నాథ్ ప్రారంభించారు. అపెడా అధ్యక్షుడు శ్రీ అభిషేక్ దేవ్, త్రిపుర వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగ కార్యదర్శి శ్రీ అపూర్బ రాయ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో అపెడా కార్యదర్శి డాక్టర్ శాశ్వతి బోస్, నాబార్డ్ జనరల్ మేనేజర్ శ్రీమతి తనుశ్రీ భట్టాచార్య, వ్యవసాయ డైరెక్టరు శ్రీ ఫణిభూషణ్ జమాతియా, టీఎస్ఓఎఫ్‌డీఏ మిషన్ డైరెక్టరు శ్రీ రాజీబ్ దేబ్‌బర్మ, అపెడా అధికారులు, ఎగుమతి, లాజిస్టిక్స్ భాగస్వాముల ప్రతినిధులు, ఆ ప్రాంతానికి చెందిన వరి పండించే అభ్యుదయ రైతులు తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా త్రిపుర వ్యవసాయ మంత్రి శ్రీ రతన్ లాల్ నాథ్ మాట్లాడుతూ, ఎన్‌పీఓపీ ధ్రువీకరించిన సాంప్రదాయిక బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడం రాష్ట్రానికి సంతోషదాయక క్షణమన్నారు. ఇది రైతులు, ఎఫ్‌పీసీలు, ఇతర ఆసక్తిదారు వర్గాలు పడిన కష్టాన్ని సూచిస్తోందని చెప్పారు. ఆర్గానిక్ ఉత్పాదనలతో పాటు సాంప్రదాయిక వ్యావసాయిక ఉత్పాదనల్లో త్రిపురకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఇలాంటి కార్యక్రమంతో రైతులకు కొత్త మార్కెట్ల వరకు చేరుకోవడం, మెరుగైన ధరను అందుకోవడంతో పాటు స్థిరత్వం కలిగిన జీవనోపాధిని సంపాదించుకోవడంలోనూ తోడ్పాటు లభిస్తుందన్నారు. ఆర్గానిక్ సాగు విస్తారిత అనుబంధ వ్యవస్థను పటిష్టపరచడానికి, అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంలో రైతులకు సాయపడటానికి త్రిపుర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఉట్నూర్‌లో ఘనంగా ప్రజాపాలన సంబరాలు

## వెయ్యి రోజుల పాలనలో సంక్షేమ పథకాలకు పెద్దపీట
## కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన సిగ్గుచేటన్న నాయకులు




ఆదిలాబాద్, సెప్టెంబర్ 5:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన చేపట్టి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు శనివారం ఉట్నూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, లక్కారం మాజీ సర్పంచ్ మర్సకోల తిరుపతి, టౌన్ అధ్యక్షుడు సయ్యద్ నిసార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి ఇచ్చారా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం, అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, ఆదిలాబాద్ ఆర్టీఏ సభ్యుడు దూట రాజేశ్వర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బిరుదుల లాజర్, టౌన్ అధ్యక్షుడు నిసార్, ఎస్సీ సెల్ ఉట్నూర్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మహేందర్, సహకార చైర్మన్ ఎస్పీ రెడ్డి, సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ.. 1000 రోజుల పాలనపై సందడి

కరీంనగర్, సెప్టెంబర్ 5రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా పెద్దపల్లిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆధ్వర్యంలో చీకురాయి చౌరస్తా నుంచి జెండా వరకు ర్యాలీ సాగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ భారీ ప్లెక్సీలను ప్రదర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వాణిజ్య పరిధి విస్తరణ దిశగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల దేశవ్యాప్త సద్వినియోగం పెరగాలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: భారత అంతర్జాతీయ వాణిజ్య పరిధి విస్తరణ దిశగా దేశవ్యాప్తంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ) సద్వినియోగం మరింత పెరగాలని కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో "ఎఫ్‌టీఏ'ల సద్వినియోగంపై అవగాహన కార్యక్రమం'' కింద ఇవాళ నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. ఈ ఒప్పందాల వల్ల మార్కెట్ సౌలభ్యం మెరుగుపడిందని, తద్వారా లభించే ప్రయోజనాలు దేశంలోని అన్ని వ్యాపారాలకూ గరిష్ఠ స్థాయిలో చేరాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్రీకృత, సార్వజనీన, దేశవ్యాప్త కృషి మరింత ముమ్మరం కావాలని సూచించారు. భారత 'ఎఫ్‌టీఏ'ల నెట్‌వర్క్ నానాటికీ విస్తరిస్తున్నందున అన్ని వ్యాపార-వాణిజ్య సంస్థలకూ ఎగుమతి అవకాశాలు అందేవిధంగా సమష్టి కృషి అవశ్యమని శ్రీ గోయల్ స్పష్టం చేశారు.

ఈ కృషి దేశమంతటా వేగంగా విస్తరించడం ద్వారా చిన్నాపెద్దా తేడా లేకుండా మొత్తం 780 జిల్లాల్లోనూ చివరి అంచెలోగల అతిచిన్న వ్యాపారి, వాణిజ్య-పారిశ్రామికవేత్త, అంకుర సంస్థ, మహిళా వ్యాపారవేత్తల స్థాయిదాకా ప్రయోజనం చేకూరాలని శ్రీ గోయల్ అన్నారు. ప్రధానంగా అంతర్ముఖ దేశీయ ఆర్థిక వ్యవస్థగా పరిగణనలోగల భారత్‌ను ఓ కీలక అంతర్జాతీయ శక్తిగా నిలపాలనే బృహత్సంకల్ప సాధనలో ఎంత స్వల్ప స్థాయిలోనైనా లభించే సహకారం అత్యంత అమూల్యమైనదేనని ఆయన అభివర్ణించారు.

దేశమంతటా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో భారత ఎగుమతిదారులకు.. ముఖ్యంగా 'ఎంఎస్‌ఎంఈ'లకు, తొలిసారిగా ఎగుమతి చేసేవారికి నిర్దిష్ట ఫలితాలు చేకూర్చడం లక్ష్యంగా ఒకరోజు పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల అధికారులు, ఎగుమతి ప్రోత్సాహక మండలాలు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా భారత్ పోషిస్తున్న పాత్ర ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు, గౌరవం పొందగల ఆర్థిక వ్యవస్థగా, ఇతర దేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా మన దేశం మారాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ విశ్వాసం విలువగా మారాలని, 2047 నాటికి అంతర్జాతీయ వాణిజ్యంలో అత్యధిక వాటాతో భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందడంలో దేశవ్యాప్త సమష్టి కృషి ద్వారా ఈ విలువ ప్రతిపాదన రూపుదిద్దుకోవాలని సూచించారు.

భారత్ నేడు తన ఆర్థిక ప్రస్థానంలో కీలక మలుపును చేరిందని శ్రీ గోయల్ అన్నారు. స్థిరమైన ధరల వద్ద ఈ ఏడాది తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదవడం ఒక ప్రధాన విజయమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, గందరగోళం మధ్య ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం అపూర్వమని వ్యాఖ్యానించారు. ఈ వాస్తవాన్ని "వ్యతిరేకించే వారి" వ్యాఖ్యానాలను విశ్వసించవద్దని ఆయన ప్రజలను కోరారు.

కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ పరిధిలో విస్తృత, క్షేత్రస్థాయి యంత్రాంగం స్వతంత్ర ప్రక్రియ ద్వారా దశాబ్దాలుగా ఈ గణాంకాలను రూపొందిస్తుంది తప్ప ప్రభుత్వం, మంత్రులు లేదా అధికారులకు వాటితో నిమిత్తం లేదని ఆయన స్పష్టం చేశారు.

యావద్దేశాన్నీ ముందుకు నడిపిస్తూ, కొత్త పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ విపణుల వైపు ప్రోత్సహిస్తూ, అందివచ్చే అపార అవకాశాలను సద్వినియోగానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ మేరకు మరింత సార్వజనీనతతో నిరంతర, సుస్థిర, అవిరళ ఫలితాధారిత ప్రయత్నాలు సాగాలని సూచించారు.

సుమారు 60 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థలతో భారత్ కుదుర్చుకున్న 9 'ఎఫ్‌టీఏ'లు ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడింట రెండువంతుల వాటా వరకూ ప్రాధాన్య సౌలభ్యం కల్పిస్తాయని శ్రీ పీయూష్ గోయల్ చెప్పారు. రాబోయే కొన్ని నెలలు లేదా రెండేళ్ల వ్యవధిలో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, ఎస్ఏసీయూ, జీసీసీ, ఇజ్రాయెల్ సహా అనేక దేశాలతో భారత్ 'ఎఫ్‌టీఏ'లు కుదుర్చుకోనుందని తెలిపారు. అంతేకాకుండా ఆసియాన్, కొరియా, జపాన్ విపణుల సమీక్షకు కృషితోపాటు మరింత మార్కెట్ సౌలభ్యం కోసం చేపట్టే ఇతర చర్యలతో మన పోటీదారులతో పోలిస్తే స్వల్ప వ్యయంతో ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను భారత్ కైవసం చేసుకోగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మన పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన వాణిజ్య వాటా పొందడమే అంతిమంగా ప్రాధాన్య వాణిజ్య ఒప్పందం (పీటీఏ), ఎఫ్‌టీఏ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) తదితరాల పరమార్థమని చెప్పారు. వాస్తవ సుంకానికి అంకెలతో నిమిత్తం ఉండదని, దాన్ని పోటీకి అనుగుణంగానే పరిగణించాలని ఆయన వివరించారు.

అమెరికా, ఐరోపా సమాఖ్యల వాణిజ్య సరళి భిన్నమని, వాటి నిర్వహణ-కార్మిక వ్యయాలు పూర్తిగా వేర్వేరని శ్రీ గోయల్ అన్నారు. అందువల్ల ఇతర మార్కెట్లలో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి మన పోటీదారులు చెల్లించే సుంకాలతో భారత్ అంచనాలు వేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమను ఉదాహరిస్తూ- 'ఎల్‌డీసీ' హోదాతోపాటు 'ఎఫ్‌టీఏ'లతో ప్రయోజనం పొందుతూ శూన్య లేదా స్వల్ప సుంకాలతో అభివృద్ధి చెందిన మార్కెట్లను అందుకోగలిగిన బంగ్లాదేశ్, వియత్నాంలతో పోటీ పడటంలో భారత్ చిరకాలం నుంచీ ఇబ్బందులు ఎదుర్కొంటోందని శ్రీ గోయల్ చెప్పారు. ఆ మేరకు అధిక సుంకాల సమస్యతో మన దేశం సతమతం కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. కానీ, నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, దాదాపు అన్ని అభివృద్ధి చెందిన మార్కెట్లలో పోటీ దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన ధరలను పొందుతున్నదని చెప్పారు. ఈ విషయంలో పనితీరు తప్ప మరెలాంటి సాకులకు వీల్లేకుండా పోయిందని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్పత్తి పరిమాణం, నాణ్యత, శ్రద్ధ, వినియోగదారుల విశ్వసనీయత నిలబెట్టుకోవడం, షెడ్యూళ్లు, ప్యాకేజింగ్ పరంగా సకాలంలో సరఫరా చేయడం తదితరాలపై పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపారు. "అంటే- అవకాశాలు నేడు పూర్తిగా మన చేతిలోనే ఉన్నాయి'' అని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమష్టి కృషిలో ప్రభుత్వం, సంబంధిత ఇతర మంత్రిత్వ శాఖలు భాగం పంచుకుంటాయని, వాణిజ్య శాఖతోపాటు దీని పరిధిలోని 'డీపీఐఐటీ' అన్ని శాఖల సమన్వయంతో సారథ్య బాధ్యతలు నిర్వర్తిస్తుందని శ్రీ గోయల్ చెప్పారు. తదనుగుణంగా భారత్ వాణిజ్య ప్రస్థానంలో కీలక పాత్ర పోషిస్తున్న వస్త్ర, ఔషధ, రసాయన, ఎలక్ట్రానిక్స్ రంగాలు సహా అన్ని కీలక మంత్రిత్వ శాఖలను సంప్రదింపుల ద్వారా క్రమంగా ఇందులో భాగస్వాములను చేయాలన్నారు.

ఇప్పటికే అమలులోగల, రాబోయే 'ఎఫ్‌టీఏ'లపై మంత్రి మాట్లాడుతూ- ప్రస్తుతం ఏడాదికి ఒక ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే (జూలై 15 నుంచి)లతో ఒప్పందాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అటుపైన మరో నాలుగు దేశాలతో 'ఈఎఫ్‌టీఏ' కూడా త్వరలో అమలు కానుండగా, న్యూజిలాండ్‌తో పాటు ఐరోపా సమాఖ్యలోని 27 దేశాలతో ఒప్పందాలు త్వరలో అమలులోకి రానున్నాయి.

భారత్ పోటీతో పోలిస్తే అమెరికా ఒక ప్రాధాన్య రేటును ప్రకటించగలిగితే తక్షణం 'బీటీఏ'ను ఖరారు చేసి, పూర్తి వివరాలను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటిదాకా కుదుర్చుకున్న 9 'ఎఫ్‌టీఏ'లలోనూ భారత్ మంచి ఒప్పందాలనే కుదుర్చుకున్నదని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ప్రతి ఒప్పందం ఉభయంతారకంగా ఉండటమే కాకుండా రైతులు, మత్స్యకారులు, 'ఎంఎస్‌ఎంఈ'లు, కార్మికులు సహా కీలక రంగాలతోపాటు ఔషధ, వస్త్ర, ఆహార-వ్యవసాయ ఉత్పత్తుల వంటి ప్రధాన రంగాల్లో ప్రతిదానిపైనా భారత్ గర్వించదగిన మంచి ఒప్పందాలను కుదుర్చుకున్నదని ఆయన తెలిపారు.

సన్నిహిత భాగస్వాములతో సంయుక్త భాగస్వామ్యం, సంప్రదింపుల ఫలితంగా ఈ ఒప్పందాలన్నీ చక్కగా కుదిరాయని ఆయన అన్నారు. కీలక రంగాలకు గణనీయ రక్షణ సహా భారత్‌కు ఆసక్తి, నైపుణ్యం గల రంగాల్లో ఎగుమతి సామర్థ్యాన్ని కూడా ఇవి ప్రోదిచేస్తాయని తెలిపారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ట్రిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకోవడం సుమారు 16 శాతం వృద్ధిని సూచిస్తున్నదని శ్రీ గోయల్ అన్నారు.

గత ఏడాది ఏప్రిల్-జూలై మధ్య ఎగుమతులు 280 బిలియన్ డాలర్లు కాగా, ఈ ఏడాది తొలి త్రైమాసికంలో సుమారు 317 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపారు. తద్వారా తొలి నాలుగు నెలల్లోనే పెరుగుదల 36 నుంచి 37 బిలియన్ డాలర్లమేర నమోదైందని పేర్కొన్నారు.

సాధారణంగా క్రిస్మస్ పర్వదినం సమీపించే కొద్దీ మన ఎగుమతులు వేగం పుంజుకుంటాయని, ఆ మేరకు జనవరి-మార్చి మధ్య చివరి త్రైమాసికంలో గరిష్ఠ స్థాయికి చేరుతాయని వివరించారు. ప్రస్తుత ధోరణి ఒక శుభ సంకేతమని, ఈ వృద్ధి వేగాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఇప్పటిదాకా అందుబాటులోగల ఆగస్టు నెల గణాంకాలను ప్రస్తావిస్తూ- భారత్ నేడు సముచిత మార్గంలోనూ సాగుతున్నదని శ్రీ గోయల్ అన్నారు. సమష్టి కృషితోపాటు మరిన్ని అవకాశాలు అందిరావడంతో వర్తమాన-భవిష్యత్ సామర్థ్యంగల దేశంలోని ప్రతి జిల్లాకు, ప్రతి రంగానికీ ఈ అవకాశాలు చేరువ కాగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

భారత్ తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరించడమే కాకుండా కొత్త ఎగుమతిదారులను ప్రోత్సహిస్తుందని, ప్రస్తుతం చిన్న స్థాయిలో ఉన్నవారు మరింత ఎదిగేందుకు చేయూత ఇస్తుందని చెప్పారు. అలాగే, పెద్ద ఎగుమతిదారులకూ సాధ్యమైన ప్రతి అంశంలోనూ అన్నివిధాలా మద్దతిస్తుందని ప్రకటించారు.

ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు మద్దతివ్వాల్సిందిగా కోరుతూ- వినూత్న, విశిష్ట ఆలోచనలను పంచుకోవాలని శ్రీ గోయల్ పిలుపునిచ్చారు. కొండ ప్రాంతాలు లేదా కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ సహా ఈశాన్య ప్రాంతాల నుంచి ఎగుమతులకు ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి ప్రభుత్వం తోడ్పాటునిస్తుందని చెప్పారు. ఈ మేరకు అవసరమైన మేర నియంత్రణ ఆమోదాలు, 'ఎస్‌పీఎస్'-టీబీటీ ఆమోదాలు, రవాణా నష్టపరిహారం తదితర కీలకాంశాలపై ఆలోచనలు-సూచనల స్వీకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. హోర్ముజ్ జలసంధి వల్ల సమస్య ఎదురయ్యే సందర్భాల్లో- ముఖ్యంగా చిన్న ఎగుమతిదారులకు మద్దతిచ్చే మార్గాన్వేషణ చేయాలని సూచించారు.

ఇప్పటి నుంచి మరో నాలుగేళ్లలో- అంటే.. 2030కల్లా ఎన్నో ఏళ్ల కిందట నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంపై భారత్ గురిపెట్టాలని మంత్రి అన్నారు. భారత్ ఇప్పటికే కోవిడ్ మహమ్మారి సహా రెండు యుద్ధాలను, అనేక సవాళ్లను ఎదుర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే, కేంద్రీకృత కృషితో ముందడుగు వేయాలని, 2 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని దేశం వదులుకోరాదని పిలుపు నిచ్చారు.

సంకల్పం భారీదైనపుడు సామర్థ్యం కూడా బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. కొన్ని లోపాలున్నప్పటికీ, ఫలితం సాధ్యమైనంత వరకు 2 ట్రిలియన్ డాలర్లకు చేరువగా ఉండాలన్నారు. అంతేగానీ, 1.2 ట్రిలియన్ లేదా 1.3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యంతో మాత్రమే దేశానికి సేవ చేయడమనే ప్రసక్తి ఉండదన్నారు. లక్షలాది మందికి ఉద్యోగాల కల్పన, కొత్త పారిశ్రామికవేత్తల సృష్టి వంటి లక్ష్యాలను సాధించడం అసాధ్యమని స్పష్టం చేశారు.

కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయడంపై యోచించాలని శ్రీ గోయల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆయా కార్యాలయాలు రాష్ట్రాల్లో ఉన్నాయని, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి మద్దతివ్వాలన అవసరం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, జౌళి, మెరైన్, వ్యవసాయం, రత్నాలు, ఆభరణాలు, చర్మ పరిశ్రమ సహా ప్రతి రంగంలోనూ అపార అవకాశాలు ఉన్నాయని, ఈ జాబితాకు అంతులేదని ఆయన చెప్పారు.

సేవల రంగంలో అనేక కొత్త రంగాలు రూపుదిద్దుకోవడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ముఖ్యంగా ఆర్థిక రంగంలో ప్రతి దేశం ఆకాశమే హద్దుగా నిర్ణయించుకుంటోందని అన్నారు.

సాంకేతిక ప్రమాణాలు, పారిశుద్ధ్య-ఎస్‌పీఎస్ ప్రమాణాల ప్రాధాన్యాన్ని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. అనైతికమైన ఏ అంశానికీ భారత్ ఒక మాధ్యమం కారాదని, ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా నిలవడమే మన లక్ష్యం కావాలని ఉద్బోధించారు.

భారత్ వాస్తవిక విలువను జోడించే దేశంగా ఎదగాలని, మనం జారీ చేసే ఉత్పత్తి దేశ ధ్రువీకరణ పత్రానికి ఎనలేని విలువ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

రాబోయే 100 'భవ్య' పారిశ్రామిక పార్కుల దిశగా ఎగుమతిదారులకు ప్రధానంగా మద్దతిస్తామని మంత్రి తెలిపారు. ఉన్నత ప్రమాణాలకు కట్టుబడిన ఎగుమతిదారుల కేటాయింపులకు రాయితీ ఉంటుందన్నారు. ఎగుమతిదారుల కార్యకలాపాల కోసం సర్వసన్నద్ధ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ లేదా పారిశ్రామిక పార్కుల ద్వారా ఇప్పటికే గల సముదాయలకూ మద్దతు లభిస్తుందని హామీ ఇచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట పైనుంచి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగాన్ని శ్రీ గోయల్ ప్రస్తావించారు. అన్ని రంగాల ఉత్పత్తులూ అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా చూడాలన్న ప్రధానమంత్రి దృక్కోణాన్ని గుర్తుచేశారు. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను అందుకోవడంతో సరిపెట్టకుండా అంతకుమించిన ఘనత సాధించేలా కృషి చేయాలని సంస్థలకు పిలుపునిచ్చారు.

శిఖర స్థాయికి దూసుకెళ్లే మార్గం ఇదేనని, విప్లవ స్థాయిలో దేశం ఈ కృషిని కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.

### శ్రీ గోయల్ చివరగా నిర్దిష్ట అంశాలను ప్రస్తావిస్తూ కీలక సూచనలిచ్చారు:

మొదటిది: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఇప్పటికే వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుతున్న ఉత్పత్తులను, సముదాయాలను ప్రతి రాష్ట్రం గుర్తించాలి. అలాగే, ఏయే ప్రయోజనాలు ఇంకా పూర్తిగా వినియోగంలోకి రాలేదో కూడా చూడాలి. తద్వారా ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు అవసరమో అంచనా వేయవచ్చు.

రెండోది: తొలిసారి ఎగుమతిదారులను, కొత్త ఉత్పత్తులను గుర్తించాలి. 'ఎంఎస్‌ఎంఈ'లు సహా తొలిసారి ఎగుమతిదారులు ప్రపంచ మార్కెట్లలో ప్రవేశించేందుకు ఈ-కామర్స్ ఒక సులువైన మార్గంగా ఉంది. కాబట్టి, పెద్ద ఎత్తున ఎగుమతుల ప్రారంభానికి వీలుగా వాటిని ప్రోత్సహిస్తూ కొన్ని మార్పులు చేశామని ఆయన వెల్లడించారు.

మూడోది: ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల (ఈపీసీల) మధ్య సమన్వయ బలోపేతం సహా అవి తమ పరిధిలోని పరిశ్రమలకు చేరువ కావాలి. అయితే, 'ఈపీసీ'లు-పరిశ్రమల మధ్య సంప్రదింపులు క్షేత్రస్థాయితోపాటు చివరి అంచెకు, ముందు వరుస ఎగుమతిదారులకు చేరువ కావకపోవడం తనకు ఆందోళన కలిగిస్తున్నదని శ్రీ గోయల్ వ్యాఖ్యానించారు. 'ఈపీసీ'లు తమ సందేశాన్ని ఎగుమతిదారులకు, పరిశ్రమలకు ఎంతవరకు చేరవేస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా ఉందని ఆవేదన వెలిబుచ్చారు.

అలాగే, పారిశ్రామిక సంఘాలు కూడా చివరి వ్యక్తి లేదా అతి చిన్న యూనిట్ దాకా చేరువ కావాల్సిన అవసరం ఎంతయినా ఉందని స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వం, సంఘాలు, 'ఈపీసీ'ల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, ప్రతి జిల్లా నుంచి మరింత ఎక్కువ మందిని అంతర్జాతీయ ప్రతినిధి బృందాలలో సభ్యులుగా చేర్చాలన్నారు. సరైన ఉత్పత్తులను సరైన మార్కెట్లలో ప్రదర్శించాలని ముఖ్యంగా రంగాలవారీ ప్రతినిధి బృందాల సంఖ్యను పెంచాలని సూచించారు.

నాలుగోది: పారిశ్రామిక సంఘాలు తమకుతాము లక్ష్యనిర్దేశం చేసుకోవాలని, అదే సమయంలో 'ఈపీసీ'లు మరింత ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలని చెప్పారు. తమతమ సభ్యులకు, 'ఎంఎస్‌ఎంఈ'లకు స్థానిక భాషలలో, సులభంగా అర్థమయ్యే సారాంశంతో విస్తృత సమాచారం అందించాలని తెలిపారు. సభ్యుల సంఖ్యను ఎంచాలని, ప్రభుత్వం-ఎగుమతిదారుల మధ్య మద్దతుకు కేంద్రకంగా, పరస్పర సహకారంలో వాస్తవ చేయూతగా నిలవాలని పిలుపునిచ్చారు.

సంబంధిత మంత్రిత్వశాఖ రంగాలవారీగా లేదా సముదాయాల వారీగా వర్క్ షాప్‌లు నిర్వహించాలన్నారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో ఒక సంప్రదింపుల అధికారిని నియమించి సౌలభ్య కల్పన యంత్రాంగాన్ని రూపొందించాలని సూచించారు. తమను సంప్రదించే ఎగుమతిదారుల సమస్యలపై ప్రతిస్పందన అత్యంత వేగంగా, సాధ్యమైనంత వరకు తక్షణం ఉండాలన్నారు. ముఖ్యంగా పదేపదే కార్యాలయాలను సందర్శించే అవసరం లేకుండా ప్రతి సందర్భంలోనూ ఆన్‌లైన్ మార్గాలు అందుబాటులో ఉండాలని నిర్దేశించారు.

సమష్టి కృషి ద్వారానే క్షేత్రస్థాయిలో లక్షలాది ఉద్యోగాల సృష్టి సాధ్యమని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. దేశానికి బిలియన్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం సమకూరడమే కాకుండా భావి తరాలు భారీ స్థాయిన ఎగుమతి వ్యాపారంలో ప్రవేశించగల స్ఫూర్తి లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

నేటి అమృత శకంలో వర్ధమాన దేశమైన భారత్, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తితో అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందగలదని ఆశాభావం వెలిబుచ్చుతూ శ్రీ గోయల్ తన ప్రసంగం ముగించారు.

అనంతరం కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, 'ఈపీసీ'లు, పారిశ్రామిక సంస్థలు సహా భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తేవడమే ఈ వర్క్ షాప్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వివిధ రంగాల్లోని పరిశ్రమలకు లభించే నిర్దిష్ట అవకాశాలను అన్ని రాష్ట్రాలకూ తెలియజేయడం కోసమే ఈ విభిన్న చర్చాగోష్ఠులను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎగుమతి రంగానికి ప్రోత్సాహంలో రాష్ట్రాల భాగస్వామ్యంతో కూడిన సుస్థిర విధానంపై ప్రభుత్వ నిబద్ధతను ఈ వర్క్ షాప్‌లో ప్రముఖులు, నిపుణుల ప్రసంగాలు పునరుద్ఘాటించాయి.

# కోనసముందర్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నిజామాబాద్, సెప్టెంబంర్ 5:మండలంలోని కోనసముందర్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు తమకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురువుల గొప్పతనం, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్రను వివరిస్తూ పలువురు విద్యార్థులు పాటలు పాడి, ప్రసంగాలు చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్రి మధుపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గురువులను సత్కరించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

# కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఖమ్మం, సెప్టెంబర్ 5:జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి కోనేరు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు భక్తిశ్రద్ధలతో, పండుగ వాతావరణాన్ని తలపించేలా సాగాయి. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మహిళలు భక్తిగీతాలకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు.

అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వేడుకలను ముగించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. కోనేరు దివ్య, తాటివల్లి రాజేశ్వరి, కంభంపాటి విజయ, పలివేల గాయత్రి, ఇంటూరి సుగుణ, చెక్క కమల, మేక రత్న, పల్లపోతు కవిత, అయిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే 10 సంవత్సరాలలో ప్రపంచ భాగస్వామ్యాల కోసం రక్షణ దౌత్య పత్రం 'రక్ష' ను ఆవిష్కరించిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:'రక్ష' పేరుతో రూపొందించిన రక్షణ దౌత్య పత్రాన్ని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో విడుదల చేశారు. వచ్చే 10 సంవత్సరాల్లో ప్రపంచ రక్షణ భాగస్వామ్యాల కోసం భారతదేశ వ్యూహాత్మక ప్రణాళికను, దార్శనికతను ఈ పత్రంలో వివరించారు.

ఈ పత్రం భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య విధానంలో మార్పును సూచిస్తూ, జాతీయ భద్రతా లక్ష్యాలను క్రియాశీలక ప్రపంచ సహకారంతో సమన్వయం చేస్తుంది. దీర్ఘకాలిక సుస్థిరత, పరస్పర అభివృద్ధిని ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ వ్యూహాత్మక పత్రంలో పేర్కొన్న ముఖ్యమైన అంశాలు:

వ్యూహాత్మక భాగస్వామ్యాలు: ద్వైపాక్షిక, బహుపాక్షిక భద్రతా సహకారాన్ని మరింతగా బలోపేతం చేయడం.

సామర్థ్యం పెంపు: మిత్రదేశాలతో ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలను విస్తరించడం, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడం.

స్వదేశీ ఎగుమతులు: మేక్-ఇన్-ఇండియా రక్షణ వేదికలను ప్రోత్సహించి, దేశాన్ని విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా మార్చడం.

సముద్ర భద్రత: హిందూ మహాసముద్ర ప్రాంతంలో నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్‌గా, తొలి స్పందనదారుగా భారతదేశ పాత్రను బలోపేతం చేయడం.

రక్షణ దౌత్యం భారతదేశ విదేశాంగ విధానంలో ఒక కీలకమైన మూలస్తంభంగా ఉన్నందున ఈ పత్రం రాబోయే దశాబ్దానికి స్పష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళికను అందిస్తుంది. తద్వారా మారుతున్న ప్రపంచ పరిణామాలలో భారత్ శాంతి, స్థిరత్వం, నిబంధనల ఆధారిత వ్యవస్థకు ప్రధాన ఆధారంగా నిలుస్తుందని ఇది హామీ ఇస్తుంది.

ఈ కార్యక్రమంలో ఆర్మీ స్టాఫ్ జనరల్ ధీరజ్ సేథ్, డిఫెన్స్ సెక్రటరీ శ్రీ రాజేష్ కుమార్ సింగ్, కార్యదర్శి (డిఫెన్స్ ప్రొడక్షన్) శ్రీ సంజీవ్ కుమార్, విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (ఈస్ట్) శ్రీ రుద్రేంద్ర టాండన్, వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, వైస్ చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్‌కు సమగ్ర రక్షణ సిబ్బంది విభాగం అధిపతి ఎయిర్ మార్షల్ తేజిందర్ సింగ్, రక్షణ మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతిక నిబంధనలతో పేదలకు అన్యాయం చేయొద్దు

## మంత్రి పొంగులేటి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన యువజన కాంగ్రెస్ నేత సుశాంత్ రెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 5: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత ఉన్నప్పటికీ ఎల్-3 కేటగిరీలో ఉండటంతో ఇల్లు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యను మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుగ్గెంపూడి సుశాంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎల్-3 కేటగిరీలో ఉన్న అర్హులైన పేదలను ఎల్-12 కేటగిరీకి మార్చడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని సుశాంత్ రెడ్డి తెలిపారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న ఇందిర మ్మ ఇళ్ల పథకానికి నిజమైన అర్హత ఉన్నప్పటికీ, కొంతమంది పేద కుటుంబాలకు లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాలు, కేటగిరీల సమస్యలతో అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకం దూరం కాకూడదని ఆయన పేర్కొన్నారు. అర్హత ఉన్న కుటుంబాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, సమస్యను పరిష్కరించే విధంగా ఉన్నతాధి.కారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సుశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

# కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో “సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030 - నిరంతర సంరక్షణను ప్రోత్సహించడం”పై జాతీయ కార్యశాల




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:“సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030 – నిరంతర సంరక్షణను ప్రోత్సహించడం” ఇతివృత్తంతో జాతీయ స్థాయి కార్యశాల (వర్క్‌షాప్)ను కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తరపున ఉత్తర ప్రదేశ్.. లఖ్‌నవూలో 2026 సెప్టెంబరు 2, 3 తేదీల్లో నిర్వహించారు.

ఈ వర్క్‌షాపును కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి పదవితో పాటు ఆ శాఖ అధీనం లోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎమ్)లో మిషన్ డైరెక్టరు పదవీబాధ్యతలను కూడా నిర్వహిస్తున్న శ్రీమతి ఆరాధన పట్నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమం ప్రారంభ సమావేశంలో ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ బ్రజేశ్ పాఠక్ పాల్గొన్నారు. శ్రీ పాఠక్ ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్య, మెడికల్ హెల్త్, కుటుంబ సంక్షేమం, తల్లీ బిడ్డల సంక్షేమశాఖ మంత్రిగా కూడా ఉన్నారు.

సమావేశంలో శ్రీ బ్రజేశ్ పాఠక్ ప్రసంగిస్తూ, కొత్తగా పెళ్లయిన జంటల నమోదుకు గల ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. అవాంఛిత గర్భధారణను నివారించడంతో పాటు, ఆరోగ్యకర, చక్కని ప్రణాళికతో కూడిన గర్భధారణను నిర్ధారించడానికి ఇది దోహదం చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ని ప్రభావవంతంగా అమలు చేయడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. దీన్లో భాగంగా మహిళలతో పాటు చంటిబిడ్డలకు సురక్షిత, గౌరవపూర్వక, నాణ్యత సహిత ఆరోగ్య సేవలను అందించడంపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారని మంత్రి అన్నారు.

సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి పదవితో పాటు, ఆ శాఖ అధీనంలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎమ్)లో మిషన్ డైరెక్టరు పదవీబాధ్యతలను కూడా నిర్వహిస్తున్న శ్రీమతి ఆరాధన పట్నాయక్ కీలకోపన్యాసాన్ని ఇచ్చారు. “భారత్ మాతృత్వ మరణాల రేటును తగ్గించడంలో చెప్పుకోగిన పురోగతిని సాధించింది, ఇక ముందు కూడా మరింత మెరుగుదలను తీసుకు వచ్చే దిశగా నిరంతర ప్రాతిపదికన, నిర్దిష్ట లక్ష్యాలతో కృషి చేస్తోంది. మరీ ముఖ్యంగా తల్లుల మరణాల రేటు ఎక్కువగా ఉన్న, దురదృష్టకర ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్న, మారుమూల ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల విషయంలో ఎక్కువ శ్రద్ధను తీసుకుంటున్నారు” అని ఆమె అన్నారు.

మహిళలను, కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య వ్యవస్థ చేస్తున్న కృషిలో తల్లి స్వస్థతకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇస్తున్నారని కూడా శ్రీమతి ఆరాధన పట్నాయక్ స్పష్టం చేశారు. కుటుంబాలకు ఆనందాన్ని, అంచనను పెనవేసే శారీరక ప్రక్రియ గర్భధారణ అని ఆమె వర్ణించారు. ప్రతి ఒక్క మహిళ భద్రత, ఆత్మగౌరవం, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుకుంటూ గర్భధారణ, ప్రసవాల దశలను దాటి ముందుకు పయనించాలని శ్రీమతి ఆరాధన పట్నాయక్ ఆకాంక్షించారు.

‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ జీవిత చక్రంతో పాటు నిరంతర సంరక్షణ దృష్టికోణాన్ని అనుసరిస్తుందని, గర్భధారణ కన్న ముందుగా సంరక్షణ, కాన్పునకు పూర్వం ఆరోగ్య సంరక్షణ, గర్భం దాల్చిన వేళ, ప్రసవానంతరం సంరక్షణ వరకూ తల్లి ఆరోగ్య ప్రస్థానంలో మెరుగైన స్వాస్థ్య పోషణ లక్ష్యాలను నెరవేర్చేలా వివిధ దశలను దీనిలో అనుసంధానించారని శ్రీమతి అనురాధ పట్నాయక్ వివరించారు. ఈ కార్యాచరణ ప్రణాళిక.. లోటుపాట్లను భర్తీ చేసే, వర్తమాన ఆరోగ్య ప్రణాళికలను బలోపేతం చేసే, తల్లీబిడ్డలకు ఎప్పటికప్పుడు సమాన రీతిలో, నాణ్యత పూర్వకమైన ఆరోగ్య సంరక్షణకు పూచీపడేటందుకు ఒక కేంద్రిత, బహుపార్శ్విక చర్యల వ్యవస్థను అందిస్తుందని ఆమె తెలిపారు. దీనిలో సామాజికంగా, ఆర్థికంగా, శారీరకంగా, పర్యావరణ పరంగా ఏర్పడుతున్న నష్టాల వల్ల బాధితులుగా మారుతున్న వారి విషయంలోనూ, స్వల్ప స్థాయి సేవలను మాత్రమే అందుకోగలుగుతున్న ప్రాంతాల నివాసుల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆమె అన్నారు.

సమావేశంలో బర్త్ వెయిటింగ్ హోం (బీడబ్ల్యూహెచ్) మార్గదర్శకాలు, ప్రజల్లో ఆరోగ్య, సామాజిక అవగాహనను పెంచడానికి పోస్టర్లు, కరపత్రాలు, వీడియోలు, చిన్న పుస్తకాల వంటి ‘సుమన్ రోడ్‌మ్యాప్ 2030’ సంబంధిత సమాచార, విద్యా, కమ్యూనికేషన్ (ఐఈసీ) మెటీరియల్‌ను పరిచయం చేయడమే కాకుండా, ‘సుమన్ రోడ్‌మ్యాప్ 2030’ని గురించి వివరించే వీడియోను కూడా ప్రదర్శించారు. ఇది రాష్ట్రాలు, క్షేత్ర స్థాయుల్లో కార్యాచరణ ప్రణాళికను ప్రభావవంతంగా అమలు చేయడానికి అందుబాటులో ఉన్న వనరులను మరింత పటిష్ఠపరుస్తుంది.

ఈ వర్క్‌షాపులో దేశం నలుమూలల నుంచి 200 కన్న ఎక్కువ మంది పాలుపంచుకున్నారు. వారిలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మిషన్ డైరెక్టర్లు, సీనియర్ అధికారులు, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో పాటు సాంకేతిక నిపుణులు, విద్యాసంస్థలు, వృత్తినైపుణ్య సంస్థలు, డెవలప్‌మెంట్ పార్ట్‌నర్లు కూడా ఉన్నారు. వీరు వర్క్‌షాపునకు హాజరు కావడం వల్ల విషయాలను అందరూ తెలుసుకోగలగడానికి, క్షేత్ర స్థాయిలో ఎదురైన అనుభవాన్ని తెలియజేయడానికి, సుమన్ రోడ్‌మ్యాప్ 2030 లో భాగంగా ఆశిస్తున్న ప్రగతికి వేగాన్ని అందించడానికి, రాష్ట్ర వారీ ప్రాధాన్యాలకు అనుగుణంగా చర్చలను చేపట్టడానికి మార్గం సుగమమైంది.

రాష్ట్రాలు, జిల్లాల నిర్దిష్ట అవసరాలను పూర్తి చేయడంతో పాటు పూర్తి దేశంలో నిరంతర ప్రగతికి పూచీ పడటానికి రెండు భాగాలతో కూడిన విధానాన్ని సుమన్ కార్యాచరణ ప్రణాళిక అనుసరిస్తున్నది. సెక్షన్ ‘ఎ’లో ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సిన 13 రాష్ట్రాలతో పాటు 130 జిల్లాలను చేర్చారు. ఈ ప్రాంతాల్లో తల్లీబిడ్డల మరణాల నిష్పత్తి అధికంగా ఉన్న కారణంగా ఈ ప్రాంతాల విషయంలో విశిష్ట వ్యూహాలపై దృష్టిని కేంద్రీకరిస్తారు. సెక్షన్‘బి’లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను లెక్కలోకి తీసుకొని సుస్థిర పురోగతి సాధన దిశగా పయనించడానికి, ఆ స్థితిని పరిరక్షించడానికి తగిన వ్యూహాలను రూపొందించారు.

ఈ ప్రాథమిక ప్రణాళికను పునాదిగా చేసుకొని, సాంకేతికతపై ప్రధానంగా దృష్టి పెట్టి నిర్వహించిన సమావేశాల్లో తల్లితో పాటు చంటిబిడ్డ సంరక్షణకు పూర్తి స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. చర్చల్లో.. గర్భధారణ కన్న ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అధిక ముప్పుతో కూడిన గర్భధారణ, కాన్పు తరువాత అధిక రక్తస్రావాన్ని (పోస్ట్–పార్టమ్ హెమరేజ్.. పీపీహెచ్) నియంత్రించడం, సముదాయం స్థాయిలో తీసుకోవాల్సిన ముఖ్య చర్యలు, సిజేరియన్ సెక్షన్ సేవలను మెరుగు పరచడం, తల్లులకు అందించాల్సిన ఆరోగ్య సేవలను బలోపేతం చేయడంలో ప్రయివేటు రంగం పోషించాల్సిన పాత్ర, డిజిటల్ హెల్త్ కార్యక్రమాలు, ‘సుమన్ కాల్ సెంటర్’ ద్వారా ఫిర్యాదులను అందుకొని వాటిని పరిష్కరించే యంత్రాంగం, బీడబ్ల్యూహెచ్‌ను ప్రారంభించడం, వాతావరణ మార్పు తల్లుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు.

వర్క్‌షాప్‌లో 13 ‘హై-ఫోకస్’ రాష్ట్రాలు ఇచ్చిన ప్రజెంటేషన్ కీలకంగా నిలిచింది. ఆయా రాష్ట్రాలు ‘సుమన్ రోడ్‌మ్యాప్ 2030’లో భాగంగా తమ తమ ప్రాధాన్యాలను, అమలులో ఎదురుకాగల ముఖ్య లోటుపాట్లను, తాము చేపట్టాలనుకుంటున్న చర్యలను ప్రస్తావించాయి. ఈ సమావేశంతో రాష్ట్రాలకు పరస్పర అనుభవాల నుంచి నేర్చుకొనే, తల్లి–నవజాత శిశువు ఆరోగ్యం మెరుగుదల పరంగా వేగాన్ని పెంపొందించడానికి, ప్రత్యేక సందర్భాల వారీగా అనుసరించ దగిన వ్యూహాలను గుర్తించడానికి మార్గం సుగమమైంది.

రాష్ట్ర స్థాయిలో ఆశాజనకంగా పరిణమించిన నూతన ఆవిష్కరణలను, క్షేత్ర స్థాయి అనుభవాలను ‘గ్యాలరీ వాక్’ ద్వారా కళ్లకు కట్టేందుకు కూడా ఈ వర్క్‌షాప్ అవకాశాన్ని అందించింది. ఎన్‌ఏఎన్‌జీ, యూబీటీ, డ్రేప్స్‌ను ఉపయోగించి పీపీహెచ్‌ను ప్రభావవంతంగా నియంత్రించిన తీరును ఒడిశా, ‘సుమన్ పంచాయత్’, ‘సుమన్ సఖి చాట్‌బాట్’లను మధ్యప్రదేశ్, ‘మదర్స్ పిక్‌నిక్’, ‘గోసాయియా సమ్మేళన్’లను ఛత్తీస్‌గఢ్, ‘స్టేట్ మాటర్నల్ హెల్త్ వార్ రూమ్’ను ఉత్తరాఖండ్, ‘వాత్సల్య’ కార్యక్రమాన్ని మహారాష్ట్ర, తల్లుల మరణాలను నివారించే లక్ష్యంతో అమలుచేస్తున్న ఓ మిషన్‌ను కర్ణాటక ప్రదర్శించాయి. డిజిటల్ నూతన ఆవిష్కరణ కార్యక్రమాలను గురించి ఉత్తరప్రదేశ్ తెలియజేసింది.

తల్లుల, నవజాత శిశువుల ఆరోగ్యాన్ని పెంపొందింపచేయడంలో భాగస్వామ్యాలకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), యునైటెడ్ నేషన్స్ పాప్యులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ), ‘యూనిసెఫ్’, గేట్స్ ఫౌండేషన్, ఝిపీగో (ఏఫ్రజూతివణనీ), ఎఫ్ఓజీఎస్ఐ, సీ3, సీఐఎఫ్ఎఫ్‌ల ప్రతినిధులు సంప్రదింపులలో పాలుపంచుకున్నారు. వారు ‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ని అమలు చేయడానికి అండదండలను అందిస్తామని తమ వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు. కార్యాచరణ ప్రణాళిక ప్రాధాన్యాలను క్షేత్ర స్థాయుల్లో ప్రభావవంతంగా అమలుచేయడానికి గాను కలిసికట్టుగా పనిచేయడం, నిరంతం ప్రాతిపదికన సాంకేతికత సహాయాన్ని పొందుతుండటం, అభివృద్ధి పరమైన, సాంకేతిక పరమైన భాగస్వాములతో ఎప్పటికప్పుడు సమన్వయాన్ని నెలకొల్పుకోవడం ఎంతయినా అవసరమని ఈ చర్చలు స్పష్టం చేశాయి.

ఈ ప్రకారంగా రెండు రోజుల పాటు చోటుచేసుకున్న చర్చలు రాష్ట్రాలకు, సాంకేతిక నిపుణులకు, విద్యాసంస్థలకు, వృత్తినైపుణ్యం కల సంస్థలకు, డెవలప్‌మెంట్ పార్ట్‌నర్లకు ఒక ఉమ్మడి వేదికను సమకూర్చాయి. దీంతో వారికి తమ ప్రాధాన్య క్రమాన్ని తీర్చిదిద్దుకొనేందుకు, నూతన ఆవిష్కరణలను ప్రస్తావించుకొనేందుకు, ‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ని త్వరిత గతిన అమలుచేయడంతో పాటు, 2030కల్లా తల్లులు, చంటిబిడ్డలలో నివారించ దగిన మరణాలను ‘సున్నా’ స్థాయికి చేర్చాలన్న జాతీయ నిబద్ధతను ముందుకు తీసుకుపోవడానికి ఆచరణాత్మక వ్యూహాలను ఖరారు చేయడంలో తోడ్పాటు లభించింది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల దిశగా ప్రగతిని పరిరక్షించుకొంటూ 2030 కల్లా తల్లులు, చంటిబిడ్డలలో నివారించ దగిన మరణాలను సున్నా స్థాయికి చేర్చడానికి దేశం చేస్తున్న ప్రయత్నాలకు జోరును సంతరించడం కోసం ఒక వ్యూహాత్మక ప్రాథమిక ప్రణాళికను ‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ అందిస్తోంది. దీనికి గాను చక్కని ఫలితాలను అందించగల చర్యలను చేపడతారు.

రెండు రోజులు పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌లో, తల్లి ఆరోగ్యంతో ముడిపడిన కార్యక్రమాలపై చర్చించారు. దీనిలో గర్భధారణకు ముందు అనుసరించాల్సిన సంరక్షక చర్యలు, హై–రిస్క్ ప్రెగ్నెన్సీ, గర్భం ధరించిన తరువాత కాన్పునకు ముందు మూడు మాసాల్లో కమ్యూనిటీ–స్థాయిలో పాటించాల్సిన జాగ్రత్త చర్యలు, సిజేరియన్ సెక్షనును సరి అయిన రీతిన పూర్తి చేయడం, డిజిటల్ హెల్త్ కార్యక్రమాలు, బర్త్ వెయిటింగ్ హోమ్, వాతావరణం వల్ల తల్లి స్వస్థతపై పడే ప్రభావం, రాష్ట్రాల ప్రాధాన్యాలు, పార్ట్‌నర్ భాగస్వామ్యం వంటి విషయాలపై దృష్టిని సారించారు.

నివారించ గలిగిన ఏ కారణాల వల్ల నైనా ఏ మహిళా, లేదా ఏ నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదన్న జాతీయ సంకల్పాన్ని ఈ చర్చలలో పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, డెవలప్‌మెంట్ పార్ట్‌నర్స్‌తో కలిసి పనిచేస్తానని మంత్రిత్వ శాఖ తన సంకల్పాన్ని మరో మారు స్పష్టం చేసింది. తల్లులు, చంటి బిడ్డల ఆరోగ్యం మెరుగుపడాలని, దేశం 2030 కల్లా నివారించ దగిన మరణాలను సున్నా స్థాయికి చేర్చాలన్న లక్ష్యాన్ని చేరుకొనేటట్లుగా ‘సుమన్ కార్యాచరణ ప్రణాళిక 2030’ని విస్తృత స్థాయిలో దీర్ఘ కాలం పాటు అమలు చేసే సంస్కరణలా మార్చడం ఈ శాఖ లక్ష్యం.

## ‘సెమికాన్ ఇండియా–2026’పై మాధ్యమాలకు ఆహ్వానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: న్యూఢిల్లీలోని యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్)లో ‘సెమికాన్ ఇండియా–2026’ 5వ మహాసభను ఈ నెల 17 నుంచి 19 వరకూ నిర్వహిస్తారు. “సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ది ఇకోసిస్టమ్” ఇతివృత్తంగా సాగే ఈ కార్యక్రమం కోసం నేటినుంచి మాధ్యమాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. అలాగే, సందర్శకులు కూడా అధికారిక ‘సెమికాన్ ఇండియా రిజిస్ట్రేషన్ పోర్టల్’ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ఈ మేరకు వివిధ మాధ్యమాల ప్రతినిధులు, సిబ్బంది ‘రిజిస్టర్ నౌ’ ల్యాండింగ్ పేజీలో “విజిటర్స్” ఆప్షన్‌ను ఎంచుకుని, తమ ఖాతాను సృష్టించుకోవాలి. అందులో ప్రవేశించిన తర్వాత దరఖాస్తుదారులు తమ ప్రాథమిక వివరాలను నమోదు చేసి, కేటగిరీ కింద “మీడియా”ను ఎంచుకోవాలి.

ఇక సందర్శకులు సెప్టెంబరు 17 నాటి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావడంపై తమ ప్రాధాన్యాన్ని తెలుపవచ్చు. సౌలభ్యంపై తుది నిర్ధారణకు లోబడి వారికి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ప్రధాన ఉపన్యాసాలు, వర్క్ షాప్‌లు, బృంద గోష్ఠులపై సమాచారం కోసం ‘సెమికాన్ ఇండియా’ వెబ్‌సైట్‌లోని ‘ప్రోగ్రామ్ ఎట్ ఎ గ్లాన్స్’ను కూడా చూడవచ్చు.

భారత ప్రసిద్ధ సెమికండక్టర్ కాన్ఫరెన్స్–ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ‘సెమికాన్ ఇండియా’గా వ్యవహరిస్తారు. “ఇండియా సెమికండక్టర్ మిషన్ (ఐఎస్ఎం, కేంద్ర ఎలక్ట్రానిక్స్–ఐటీ మంత్రిత్వ శాఖ, ‘ఎస్ఈఎంఐ’ ఈ మహాసభను సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. సెమికండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ ఒక విశ్వసనీయ అంతర్జాతీయ కూడలిగా రూపొందాలనే దార్శనికత సాకారానికి ఇది తోడ్పడుతుంది. ఈ దిశగా సహకారం, ఆవిష్కరణ, తయారీ, పెట్టుబడులకు ప్రోత్సాహం తోపాటు ప్రతిభను ప్రోదిచేయడంలో ప్రపంచ సెమికండక్టర్–ఎలక్ట్రానిక్స్ వ్యవస్థను సమీకృతం చేసే ప్రధాన వేదికగా ఇది ఉపయోగపడుతుంది.

## రామాలయంలో హుండీ చోరీకి యత్నం.. ఇద్దరు నిందితుల పట్టివేత

ఖమ్మం, సెప్టెంబర్ 5:మండల పరిధిలోని చాపరాలపల్లి రామాలయంలో హుండీ చోరీకి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చేసిన యత్నం కలకలం రేపింది. ఆలయంలోని హుండీని అపహరించిన నిందితులు దానిని ఆటోలో తరలించేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై నిందితులను వెంబడించారు. పెంట్లం సమీపంలో వారిని పట్టుకుని అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు.

ఎస్సై నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు ఖమ్మం ప్రాంతానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల వివరాలు, చోరీ యత్నానికి సంబంధించిన ఇతర అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో వైభవంగా శ్రీవారి నిత్య కల్యాణం

**శ్రీ పద్మావతి అమ్మవారికి నవకలశ పంచామృత అభిషేకం.. మహాలక్ష్మి హవనం**

**సుమారు 3,600 మందికి పైగా భక్తులకు నిత్యాన్న ప్రసాదం**

నల్గొండ, సెప్టెంబర్ 5:ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం కృష్ణ పక్ష నవమి, శనివారం సందర్భంగా స్వామివారికి, శ్రీ పద్మావతి అమ్మవారికి విశేష కైంకర్యాలు, పూజా కార్యక్రమాలను అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. తెల్లవారుజామున అర్చక స్వాములు సుప్రభాత సేవతో ఉత్సవాలను ప్రారంభించి అనంతరం గోపృష్ఠ దర్శనం కల్పించారు. బంగారు బావి నుంచి సువర్ణ బిందెతో తీర్థాన్ని తీసుకువచ్చి స్వామివారికి తోమాల సేవ, సహస్రనామార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మృగశిర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ పద్మావతి అమ్మవారికి నవకలశ పంచామృత అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దివ్యాభరణాలతో అలంకరించి అష్టలక్ష్మి మంటపంలో కొలువుదీర్చి భక్తుల అష్టైశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హవనం, సహస్ర కుంకుమార్చన చేపట్టారు.

పట్టు పీతాంబరాలతో అలంకరించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవోత్సవ మంటపంలో వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని, సహస్రదీప కాంతుల మధ్య ఊయల సేవను ఘనంగా చేపట్టారు. జల నారాయణ స్వామికి మంగళ హారతులు సమర్పించారు.

# గొర్రెల కాపరుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**50 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి: దయ్యాల నరసింహ**



నల్గొండ, సెప్టెంబర్ 5:గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయ్యాల నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వృత్తిదారుల భవనంలో భీమనగోని బాలరాజ్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దయ్యాల నరసింహ మాట్లాడుతూ.. 50 ఏళ్లు నిండిన ప్రతి గొర్రెలు, మేకల పెంపకందారునికి నెలకు రూ.5 వేల వృద్ధాప్య పింఛన్ అందించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన పెంపకందారుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెంపకందారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు గతంలో ప్రభుత్వం జారీ చేసిన 1016, 559 జీవోలను తక్షణమే అమలు చేయాలని కోరారు.

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గొర్రెల కాపరుల సమస్యలపై ప్రత్యేక ఎజెండా ఏర్పాటు చేసి చర్చించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పెంపకందారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బండారు నరసింహ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండే శ్రీశైలం, జిల్లా నాయకులు గుణముని ఐలయ్య, జెనిగల యాదయ్య, జంగయ్య, వెంకటేశం, శ్రీశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చలనచిత్రాల పరిరక్షణ, ఆర్కైవింగ్, డిజిటలైజేషన్, పునరుద్ధరణపై ప్రత్యేక వర్క్‌షాప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ఎన్ఎఫ్‌డీసీ–నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ డీసీ–ఎన్ఎఫ్ఏఐ), పుణేలోని భారత చలనచిత్ర, టెలివిజన్ సంస్థ (ఎఫ్‌టీఐఐ) సహకారంతో “చలనచిత్రాలు: సంరక్షణ, ఆర్కైవింగ్, డిజిటలైజేషన్, పునరుద్ధరణ” అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను 2026 అక్టోబర్ 5 నుంచి 15 వరకు (వారాంతపు రోజులు మినహాయించి) పుణేలోని ఎన్ఎఫ్‌డీసీ–ఎన్ఎఫ్ఏఐ, ఎఫ్‌టీఐఐ ప్రాంగణాల్లో నిర్వహించనుంది.

చలనచిత్ర సంరక్షణ, ఆర్కైవింగ్, పునరుద్ధరణ, చిత్ర సాంకేతికత, ఆడియో విజువల్ వారసత్వ సంపదపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, వృత్తిపరమైన రంగంలోకి ప్రవేశించాలనుకునేవారు, పరిశోధకులు, ఇతర ఆసక్తిగల వ్యక్తుల కోసం ఈ వర్క్‌షాప్‌ను రూపొందించారు. తరగతి గది సెషన్లు, ఆచరణాత్మక ప్రదర్శనలు, ప్రత్యక్ష శిక్షణ, సంస్థల సందర్శనలు, ఆర్కైవల్, పునరుద్ధరించిన చిత్రాల ప్రదర్శనల ద్వారా చలనచిత్రాలను సంరక్షించే కళ, శాస్త్రం, ఆచరణాత్మక విధానాలపై పాల్గొనేవారికి అవగాహన కల్పిస్తారు.

చలనచిత్రాల సంరక్షణ, మెటాడేటా, డిజిటల్ సంరక్షణ, చిత్ర రకాలు, ఆధారాలు, నివారణాత్మక పరిరక్షణ, డిజిటల్ చిత్ర పునరుద్ధరణ, కాగితపు పదార్థాల పరిరక్షణ, ఆడియో పునరుద్ధరణ వంటి కీలక అంశాలను ఈ కార్యక్రమంలో బోధిస్తారు. ప్రాక్టికల్ సెషన్లలో ఫిల్మ్ గుర్తింపు, పరిశీలన, మరమ్మతులు, మాన్యువల్ ఫిల్మ్ క్లీనింగ్, సెల్యులాయిడ్, డిజిటల్ ఫిల్మ్ ప్రొజెక్షన్, ఫిల్మ్ స్కానింగ్, డిజిటలైజేషన్ ఉంటాయి. ఫిల్మ్ స్కానర్లు, చిత్రాలు, ఆడియో స్కానింగ్, నిల్వ అవసరాలు, కలర్ గ్రేడింగ్, నాణ్యత నియంత్రణ గురించి కూడా నేర్చుకుంటారు.

ఎన్ఎఫ్‌డీసీ–ఎన్ఎఫ్ఏఐలోని లైబ్రరీ, వాల్ట్స్, డాక్యుమెంటేషన్, ప్రొజెక్షన్ రూమ్ వంటి విభాగాలు, సదుపాయాల్లోని పని వాతావరణాన్ని పాల్గొనేవారు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం పొందుతారు. ప్రసాద్ కార్పొరేషన్ సహకారంతో వృత్తిపరమైన ఫిల్మ్ పునరుద్ధరణ ప్రక్రియలపై కూడా వారికి అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం సంస్థ సాంకేతిక నైపుణ్యం, పరికరాలను అందించి ఫిల్మ్ మరమ్మతులు, పరిరక్షణ, డిజిటల్ పునరుద్ధరణలో సహకరించనుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎఫ్‌డీసీ–నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా, భారత చలనచిత్ర, టెలివిజన్ సంస్థ (ఎఫ్‌టీఐఐ), భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్కైవ్స్‌ను సందర్శించేలా సంస్థాగత పర్యటనలు ఉంటాయి. ఈ సందర్శనల ద్వారా ఆర్కైవ్ సేకరణల సంరక్షణ, డాక్యుమెంటేషన్, పరిరక్షణ, నిర్వహణలో అనుసరించే వివిధ విధానాలపై పాల్గొనేవారికి అవగాహన కలుగుతుంది.

థాయ్ ఫిల్మ్ ఆర్కైవ్ అనుసరిస్తున్న విధానాలపై ప్రత్యేక సమావేశం ద్వారా అంతర్జాతీయ దృక్పథాన్ని అందిస్తారు. 35 మిల్లిమీటర్, డిజిటల్ ఫార్మాట్లపై ప్రదర్శనలతో పాటు ఆర్కైవ్, పునరుద్ధరించిన చిత్రాల ప్రదర్శనలు కూడా ఈ కార్యక్రమంలో ముఖ్యమైన భాగంగా ఉంటాయి.

ఈ కార్యక్రమం గురించి ఎఫ్‌టీఐఐ ఉపకులపతి శ్రీ ధీరజ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం చలనచిత్ర విద్య, సినీ వారసత్వ పరిరక్షణను ఒకే వేదికపైకి తీసుకువస్తుందని అన్నారు. పాల్గొనేవారికి విద్యాపరమైన అభ్యాసం, ఆచరణాత్మక అనుభవం, ప్రత్యేక సదుపాయాలను వినియోగించుకునే అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాశ్ మగ్దుమ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, వృత్తి నిపుణులుగా ఎదగాలనుకునే వారితో సంస్థాగత అనుభవాన్ని, ప్రత్యేక నైపుణ్యాలను పంచుకోవడం, అలాగే చలనచిత్ర పరిరక్షణపై మరింత ఆసక్తిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

ప్రసాద్ కార్పొరేషన్ డైరెక్టర్, సీఎటీఓ శ్రీ అభిషేక్ ప్రసాద్ మాట్లాడుతూ.. పరిశ్రమ అనుభవం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా భవిష్యత్తు తరం చలనచిత్ర పరిరక్షణ నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని అన్నారు.గ

# వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరం

**పంతంగిలో హెల్పేజ్ ఇండియా, హెచ్ఎస్‌బీసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ**



నల్గొండ, సెప్టెంబర్ 5: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో హెల్పేజ్ ఇండియా, హెచ్ఎస్‌బీసీ ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సమాఖ్య లీడర్లు, వృద్ధుల సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ తురకషద్రక్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) మాట్లాడుతూ.. జీవనోపాధి ప్రాజెక్టులో భాగంగా వృద్ధుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వృద్ధులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలతో పాటు మోకాళ్ల నొప్పులు, అధిక రక్తపోటు వంటి సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. వృద్ధుల సంక్షేమం, జీవనోపాధుల మెరుగుదలకు హెల్పేజ్ ఇండియా నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. హెల్పేజ్ ఇండియా రాష్ట్ర అధిపతి (ఏపీ, తెలంగాణ) యేతే ంద్ర యాదవ్, మేనేజర్ మిర్నాల్ శ్రీకాంత్ మార్గదర్శకంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వాలంటీర్ బోయ సుజాత, పోచంపల్లి ప్రాజెక్ట్ ఆఫీసర్ వి. వేణు, పలువురు వైద్యులు, నర్సు లు, ఫార్మాసిస్టులు, గ్రామ సమాఖ్య నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యం, వైద్య విద్య, డిజిటల్ ఆరోగ్య సేవల్లో అత్యుత్తమ వైద్య కేంద్రంగా ఎదిగిన ఈఎస్ఐసీ సనత్‌నగర్



ప్రజారోగ్యం, వైద్య విద్య, అధునాతన చికిత్స, సాంకేతిక ఆధారిత రోగి సంరక్షణలో అత్యుత్తమ వైద్య కేంద్రంగా హైదరాబాద్‌లోని ఈఎస్ఐసీ సనత్‌నగర్ ఎదిగింది. ఇందులో ఒకే చోట వైద్య కళాశాల, ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా ఈఎస్ఐసీ పరిధిలోని ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఇక్కడ అందుబాటు ధరల్లో సమగ్ర వైద్యసేవలు అందుతున్నాయి.

ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది మీడియా ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ప్రాంగణాన్ని నేడు సందర్శించింది. సంస్థ అందిస్తున్న వైద్యసేవలు, వైద్య విద్య, అధునాతన చికిత్సలు, సాంకేతిక ఆధారిత సేవలపై అవగాహన పొందడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికిన సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రి డీన్ డాక్టర్ ఎస్. సీతాలక్ష్మి.. సంస్థలోని వైద్య మౌలిక సదుపాయాలు, సాధించిన విజయాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 4 ఈఎస్ఐఎస్ ఆసుపత్రులు, 70 డిస్పెన్సరీలు, 8 శాఖా కార్యాలయాలు, 10 డిస్పెన్సరీ-కమ్-బ్రాంచ్ కార్యాలయాల (డీసీబీఓలు) ద్వారా తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలకు ఈఎస్ఐసీ సేవలు విస్తరించాయని తెలిపారు. రాష్ట్రంలో బీమా పరిధిలో 20,47,160 మంది ఉద్యోగులు, 74,32,916 మంది లబ్ధిదారులు ఉండగా, 1,63,581 మంది యజమానులు ఈ వ్యవస్థకు మద్దతుగా ఉన్నారని చెప్పారు.

సనత్‌నగర్ ప్రాంగణంలో 1,044 పడకల సమీకృత వైద్య సదుపాయం ఉందని ఆమె తెలిపారు. ఇందులో 800 పడకల ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రితోపాటు 244 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉన్నాయి. ప్రాంగణంలో 159 ఐసీయూ పడకలు, 45 డయాలసిస్ పడకలు, 10 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఐదు అధునాతన ఓటీ సూట్లు ఉన్నాయి. వీటితోపాటు విస్తృత స్థాయి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. నిరంతరం అత్యవసర సేవలు లభిస్తాయి.

గత నాలుగేళ్లుగా సంస్థలో రోగి సేవలు స్థిరంగా వృద్ధి చెందాయి. వార్షిక ఓపీడీ రోగుల సంఖ్య 2022లో 6,93,853 నుంచి 2025లో 9,80,925కు పెరిగింది. రోజువారీ సగటు ఓపీడీ రోగుల సంఖ్య 2,354 నుంచి 3,248కు చేరింది. వార్షిక అడ్మిషన్లు 78,086 నుంచి 95,037కు పెరగగా, రోజువారీ సగటు అడ్మిషన్లు 214 నుంచి 315కు చేరాయి. శస్త్రచికిత్సల సంఖ్య కూడా 2022లో 16,223 నుంచి 2025లో 20,117కు పెరిగింది. 2025లో ఆసుపత్రి పడకల వినియోగం 85.6 శాతంగా నమోదైంది. తృతీయ స్థాయి వైద్య మౌలిక సదుపాయాలు నిరంతరం విస్తృత వినియోగంలో ఉన్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

500కు పైగా పడకల విభాగంలో ఈ జంట ఆసుపత్రులు 2019 నుంచి వరుసగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఈఎస్ఐసీ ఆసుపత్రులుగా గుర్తింపు పొందుతున్నాయి.

సురక్షితమైన, రోగి కేంద్రిత, ఆధారాలతో కూడిన వైద్యసేవలను నిర్ధారించేందుకు సంస్థ పటిష్ఠమైన నాణ్యతా వ్యవస్థలు, అక్రెడిటేషన్ విధానాలను కూడా ఏర్పాటు చేసింది.

కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, ఆంకాలజీ, హెమటాలజీ, ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్ తదితర విభాగాల్లో ఈఎస్ఐసీ సనత్‌నగర్ అధునాతన సేవలు అందిస్తోంది.

నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల్లో మూత్రపిండాల మార్పిడికి ఈ ఆసుపత్రి ఈఎస్ఐసీ నెట్‌వర్క్‌లో ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. ఏబీఓ-ఇన్‌కంపాటిబుల్ కిడ్నీ మార్పిడితోపాటు సజీవ దాతలు, మృతదాతల నుంచి మూత్రపిండాల మార్పిడి సేవలను అందిస్తోంది. 2024 జూన్ 8న సంస్థ అంతర్గతంగా తొలి మృతదాత అవయవ సేకరణ చేపట్టింది. ఇప్పటివరకు 30 మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించగా, వాటిలో 18 సజీవ దాతల మార్పిడులు ఉన్నాయి. 202 5?26లో హీమోడయాలసిస్ సదుపాయం ద్వారా 59,868 మంది బీమా రోగులు ప్ర ం పొందారు. ప్రాంగణంలో అందుబాటులో ఉన్న మూత్రపిండ సంరక్షణ సేవల విస్తృతిని ఈ సంఖ్య తెలియజేస్తోంది.

పాథాలజీ విభాగం ఎన్‌ఏబీఎల్ ఎంట్రీ-లెవల్ తృతీయ స్థాయి డయాగ్నస్టిక్ లేబొరేటరీని నిర్వహిస్తోంది. ఎనిమిది ప్రత్యేక విభాగాల్లో 162 రకాల పరీక్షలు, 90కి పైగా ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ (ఐహెచ్‌సీ), మాలిక్యులర్ మార్కర్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. 2025?26లో ప్రయోగశాల 16.7 లక్షలకు పైగా పరీక్షలు నిర్వహించింది. సాధారణ చికిత్స సేవలతోపాటు ఆంకాలజీ వంటి ప్రత్యేక వైద్య విభాగాలకు సమగ్ర రోగ నిర్ధారణ సహాయాన్ని అందించింది.

రేడియాలజీ ఇమేజింగ్ సేవల కోసం పిక్చర్ ఆర్కైవింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్ (పీఏసీఎస్), ఈ-ఐసీయూ సేవలు, ఆక్సిజన్, వాక్యూమ్ పైప్‌లైన్ వ్యవస్థల తక్షణ పర్యవేక్షణ, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ డ్యాష్‌బోర్డ్, తక్షణ ఆన్‌లైన్ శాంప్లింగ్ వ్యవస్థలు వంటి పలు సాంకేతిక ఆధారిత ఆరోగ్య కార్యక్రమాలను ప్రాంగణంలో అమలు చేస్తున్నారు. ఏఏఏ+ యాప్ ఆధారిత ఓపీడీ సేవలు, ధన్వంతరి మాడ్యూల్ అమలు, నూరు శాతం ఈ-ఆఫీస్ అమలు, ఆధార్ అనుసంధానం, ఓపీడీలో ల్యాన్ కనెక్టివిటీ ఇతర కార్యక్రమాల్లో ఉన్నాయి.

ఇంటికే మందుల సరఫరా, ఇంటివద్ద నమూనాల సేకరణ, ఏఏఏ+ యాప్ ద్వారా ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులు, 5జీ ఆధారిత అంబులెన్స్ సేవలు వంటి రోగి కేంద్రిత డిజిటల్ కార్యక్రమాలు వైద్యసేవల లభ్యత, నిరంతర సంరక్షణను మరింత బలోపేతం చేశాయి.

సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల తన విద్యా వ్యవస్థను కూడా బలోపేతం చేసింది. ఇక్కడ 150 ఎంబీబీఎస్ సీట్లు, 106 ఎండీ/ఎంఎస్ సీట్లు, 15 ఎం.సీహెచ్ సీట్లు, 12 డీఆర్ఎన్‌బీ సీట్లు, 4 డీఎన్‌బీ కోర్సులు, 6 ఎఫ్ఎన్‌బీ కోర్సులు ఉన్నాయి. వీటితోపాటు కార్డియాక్ అండ్ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ సైన్స్, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, ఆప్టోమెట్రీ, రీనల్ డయాలసిస్ టెక్నాలజీ, రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ వంటి ప్రత్యేక విభాగాల్లో 72 అలైడ్ హెల్త్ సైన్సెస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ జయ కుందన్ గెడమ్, డాక్టర్ రత్నా గోసైన్, డాక్టర్ జి. లక్ష్మి ప్రసాద్, డాక్టర్ జి. తిరుపతి వివిధ చికిత్స, విద్యా సదుపాయాల గురించి ప్రతినిధుల బృందానికి వివరించారు. అనంతరం మీడియా ప్రతినిధులు ఆసుపత్రిలోని ప్రయోగశాలలను సందర్శించి, ప్రాంగణంలో అందుబాటులో ఉన్న అధునాతన రోగ నిర్ధారణ మౌలిక సదుపాయాలు, సేవలపై అవగాహన పొందారు.

అందుబాటులో, తక్కువ ఖర్చుతో, ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యసేవలు అందించేందుకు ఈఎస్ఐసీ సనత్‌నగర్ చేస్తున్న కృషిని మీడియా ప్రతినిధులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ పర్యటన అవకాశం కల్పించింది.

అదే సమయంలో వైద్య విద్య, ప్రత్యేక చికిత్స, డిజిటల్ ఆరోగ్య సేవల పురోగతిపై సమగ్ర అవగాహన పొందారు.

విస్తరిస్తున్న వైద్య మౌలిక సదుపాయాలు, పెరుగుతున్న రోగుల వినియోగం, అధునాతన అవయవ మార్పిడి, రోగ నిర్ధారణ సేవలు, పటిష్ఠమైన వైద్య విద్యా వ్యవస్థ, సాంకేతిక ఆధారిత రోగి సేవల అమలుతో ఈఎస్ఐసీ సనత్‌నగర్ ప్రజారోగ్యం, వైద్య విద్యలో ఆదర్శ సంస్థగా ఎదుగుతోంది.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు: గొర్రెపాటి వెంకట రామకృష్ణ

**విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరాలి**

**రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు**



అమరావతి, సెప్టెంబర్ 5: విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థినీ విద్యార్థులు అహర్నిశలు శ్రమించి ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. శనివారం ఘంటసాలలోని యూవీఆర్ గొర్రెపాటి పాఠశాలలో భారతరత్న, భారతదేశ రెండో రాష్ట్రపతి, దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు తన తల్లిదండ్రులు గొర్రెపాటి ఉదయభాస్కరమ్మ, వెంకట్రాయలు పేరుతో యూవీఆర్ గొర్రెపాటి పాఠశాలను స్థాపించారని వెంకట రామకృష్ణ తెలిపారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేయడం భారతదేశానికే గర్వకారణమని ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యారంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయినులను సత్కరించి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడి కిడ్నాప్ కలకలం

**చికిత్స కోసం తల్లిదండ్రులతో వచ్చిన బాబుని ఎత్తుకెళ్లిన మహిళ**

**డయల్ 100కు కాల్ చేసిన బాధితులు**

**సీసీ కెమెరాకు చిక్కిన కిడ్నాపర్ మహిళ దృశ్యాలు**

**ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు**

నిజామాబాద్, సెప్టెంబర్ 5: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రెండున్నర సంవత్సరాల బాలుని కిడ్నాప్ కలకలం సృష్టించింది. తన తల్లిదండ్రులతో కలిసి వచ్చిన బాలుడు ఆస్పత్రి ఆవరణలో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన బుద్ధి తెలియని మహిళ బాలుని అక్కడి నుండి ఎత్తుకు వెళ్లింది. బాలుడిని కిడ్నాప్ చేసుకొని తీసుకువెళ్లిన దృశ్యాలు ఆసుపత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు రికార్డయ్యాయి. నిజామాబాద్-1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి కథనం ప్రకారం.. బాల్కొండ మండలానికి చెందిన నవీన్ దంపతులు తమ ఇద్దరు కుమారులను పెద్ద కుమారుడు (4), చిన్న కుమారుడు (2) సంవత్సరాలు తీసుకొని శనివారం ఉదయం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. తల్లిదండ్రులు ఆస్పత్రిలో ఉండగా వారి ఇద్దరు కుమారులు ఆస్పత్రి ఆవరణలో ఓ పక్కన ఆడుకుంటూ ఉన్నారు. ఇద్దరు బాబులను గమనించిన ఓ గుర్తుతెలియని మహిళ వారిద్దరిని చెయ్యి పట్టుకొని తన వెంట తీసుకువెళ్లసాగింది.

ఈ క్రమంలో పెద్దబాబు ఆమెనుండి చేయి వదిలించుకొని తన తల్లిదండ్రుల దగ్గరికి వచ్చేశాడు. చిన్న బాబు వేదాంష్‌ను మాత్రం ఆ గుర్తు తెలియని మహిళ కిడ్నాప్ చేసుకొని తీసుకువెళ్లింది. తమ్ముడిని ఎవరో తీసుకువెళ్లాడని పెద్ద కుమారుడు వచ్చి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పరిగెత్తుకుంటూ వచ్చి చూసేసరికి, వారి చిన్న కుమారుడు అక్కడ అగుపించకపోవడంతో కన్నీరు మున్నీరుగా రోదిస్తూ వారు ఆస్పత్రి ఆవరణలో వెతికారు. అయినప్పటికీ కుమారుడి ఆచూకీ తెలియలేదు. దీంతో బాధితులు వెంటనే డయల్ 100 కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి తన సిబ్బందితోపాటు హుటాహుటిన జిల్లా ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. బాలుడి కిడ్నాప్ ఉదాంతాన్ని తెలుసుకొని వారు ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ లను పరిశీలించగా ఓ మహిళ వేదాన్ష్‌ను తన వెంట తీసుకు వెళుతూ ఉన్న దృశ్యం అక్కడ ఉన్న కెమెరాలు రికార్డైంది. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలుడిని కిడ్నాప్ చేసుకొని తీసుకువెళ్లిన మహిళ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ హెచ్ ఓ వెల్లడించారు.

## పేదల ఆత్మబంధువు మదర్ థెరిసా

**మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి**

**ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని విక్కుర్తి పిలుపు**

అమరావతి, సెప్టెంబర్ 5: మదర్ థెరిసా వర్ధంతిని పురస్కరించుకుని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అనాథలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం మదర్ థెరిసా చేసిన సేవలు ప్రపంచానికే ఆదర్శమని అన్నారు. ప్రేమ, కరుణ, సేవాభావంతో తన జీవితాన్ని మానవ సేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల కోసం ఆమె చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

మానవ సేవే మాధవ సేవ అనే సందేశాన్ని తన జీవితంతో చాటిచెప్పిన మదర్ థెరిసా ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విక్కుర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మదర్ థెరిసాకు ఘనంగా నివాళులర్పించారు.

## రైల్వే భద్రత, సాంకేతిక, నిర్వహణ సంబంధిత లోపాలను మెరుగుపరచాలని ఆదేశించిన కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు రైల్ భవన్‌లో రైల్వే భద్రతపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైల్వే బోర్డు ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సహా రైల్వే బోర్డు సభ్యులు, జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లు, డైరెక్టర్ జనరల్స్ (డీజీలు), డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) హాజరయ్యారు.

ఈ సమావేశంలో రైల్వే మంత్రి మాట్లాడుతూ... సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక లోపాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ విషయంలో... నిర్దేశిత కాలపరిమితి పూర్తయిన విడిభాగాల నిర్వహణ, వాటిని మార్చడం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

కార్యశాలల్లో నిర్వహణ స్థాయిని మెరుగుపరచడం, కోచ్‌ల నిర్వహణ సహా ముఖ్యంగా అగ్నిమాపక భద్రతకు సంబంధించిన విద్యుత్ వలయాలు, వైరింగ్‌పైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైల్వే మంత్రి ఆదేశించారు. వ్యాగన్లు, కోచ్‌ల కప్లర్లు, చక్రాల నిర్వహణపైనా దృష్టి సారించాలని సూచించారు.

ట్రాక్ నిర్వహణకు సంబంధించి... పాయింట్ మెషీన్లు, టర్న్అవుట్‌లు, ఫాస్టనర్‌ల సరైన నిర్వహణను నిర్ధారించుట గురించి ప్రధానంగా చర్చించారు. ఫాస్టనర్‌లు అందుబాటులో లేనిచోట, వాటిని అమర్చడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నాణ్యత లేని సరఫరాల విషయంగా కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో కేంద్ర మంత్రి ఆదేశించారు. సిగ్నలింగ్-టెలికమ్యూనికేషన్, ఓహెచ్ఈ, ట్రాక్, కోచ్‌లు, వ్యాగన్‌లకు సంబంధించిన సామాగ్రి నాణ్యతలో ఏదైనా లోపం ఉన్నట్లయితే... సంబంధిత సరఫరాదారుపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం గమనించినప్పుడు, సంబంధిత సరఫరాదారులను శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని కేంద్ర మంత్రి ఆదేశించారు.

పండగలు లేదా జాతరల కారణంగా ప్రయాణికుల రద్దీ అకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలతో సమన్వయం ద్వారా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రైల్వే మంత్రి అధికారులకు సూచించారు.

## రెండు కార్ల మధ్య ఇరుక్కున్న స్కూటీ.. 9వ తరగతి విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి, సెప్టెంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్ల మధ్య స్కూటీ ఇరుక్కోవడంతో తొమ్మిదో తరగతి విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు.

వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డిలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కూచని హేమంత్ (15), చింతల లోకేష్ ఇద్దరు స్నేహితులు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వాళ్లిద్దరూ శుక్రవారం సాయంత్రం బంధువుల ఎలక్ట్రిక్ స్కూటీ తీసుకుని, డ్రైవింగ్ నేర్చుకునేందుకు రోడ్డు మీదకు వచ్చారు. ఇంటర్నేషనల్ హోటల్ ఎదురుగా ఉన్న రహదారిపై వారు వెళుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ కారు వేగంగా వారిని ఢీకొట్టింది. దీంతో రెండు కార్ల మధ్య ఎలక్ట్రిక్ స్కూటీ ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో హేమంత్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు.

క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి కారణమైన కారును నడిపింది కూడా మైనర్ బాలుడేనని పోలీసులు గుర్తించారు.

ఇదిలా ఉంటే.. లోకేష్, హేమంత్ ఇద్దరివి నిరుపేద కుటుంబాలే. ఇద్దరికి తండ్రులు లేరని తెలుస్తోంది. హేమంత్ తండ్రి గతంలోనే మరణించగా.. తల్లి లావణ్య ఒక్కగానొక్క కుమారుడిని పోషిస్తోంది. ఇక లోకేష్ తండ్రి దశరథ్ నెలరోజుల కిందటే అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి రాజేశ్వరి కూలీపనులు చేసుకుంటూ కుమారుడిని, కూతుర్ని పోషిస్తోంది. ఇలాంటి సమయంలో జరిగిన ఈ ప్రమాదం రెండు కుటుంబాలను పెను విషాదంలోకి నెట్టింది.

## ఆగి ఉన్న లారీపైకి దూసుకెళ్లిన కారు.. ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి



కేరళ, సెప్టెంబర్ 5: కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ఒక కారు ఢీకొనడంతో కారులోని ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన కేరళలోలని త్రిశూర్ జిల్లాలో, శుక్రవారం రాత్రి 11.40 గంటలకు జరిగింది. మృతులంతా తమిళనాడుకు చెందినవారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి.

తమిళనాడు, దిండిగల్‌లోని పీఎస్ఎన్ఏ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులు కేరళలోని గురువాయూర్ నుంచి కొడుంగల్లూర్ వెళ్తున్నారు. ఇదే సమయంలో 66వ జాతీయ రహదారిపై పనంబిక్కున్ను వద్ద ఒక లారీ శుక్రవారం రాత్రి రోడ్డుపై ఆగిపోయింది. విద్యార్థులు వెళ్తున్న కారు వెనుక నుంచి వచ్చి, ఆగి ఉన్న లారీని ఢీకొంది. కారు అతి వేగంగా ఉండటం వల్ల లారీని ఢీకొనడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ ఘటనలో కారులోని 8 మంది విద్యార్థులు మరణిం చారు. కారు నుజ్జునుజ్జయింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.

గగాయపడిన విద్యార్థుల్ని బయటకు తీశారు. కారు, లారీని గుద్ది ఇరుక్కు పోవడంతో, కారులో చిక్కుకున్న క్షతగాత్రుల్ని బయటకు తీసేందుకు కార్‌ను కట్ చేయాల్సి వచ్చింది. అనంతరం విద్యార్థుల్ని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆ విద్యార్థులు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఎనిమిది మంది విద్యార్థుల మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం త్రిశూర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తు?న్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

**విద్యార్థినులకు స్కూటీల హామీ ఏమైంది?.. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

ఖమ్మం, సెప్టెంబర్ 5:విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కోదాడ బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం నుంచి రంగ థియేటర్ వరకు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు. విద్యార్థుల చదువులకు ఎంతో కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని, చదువు పూర్తయినప్పటికీ వాటి కోసం కళాశాలల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. బకాయిల కోసం ప్రశ్నిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు.

# కాంగ్రెస్ మోసపూరిత పాలనపై మండిపడ్డ ములుగు బిఆర్ఎస్

## నూగురు వెంకటాపురంలో 200 బైక్‌లతో భారీ రణభేరి!

**ఇంతకుముందు ఒక లెక్క... ఇప్పుడు ఒక లెక్క!**

**బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్ర హెచ్చరిక**

**అమలు కాని 6 గ్యారెంటీలు, 420 విఫల హామీలపై బిఆర్ఎస్ కరసేవ సమరం**

**మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఆధ్వర్యంలో వీధులను హోరెత్తించిన భారీ బైక్ ర్యాలీ**



ములుగు, సెప్టెంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): అబద్ధపు హామీలతో నమ్మించి, తీరా అధికార పీఠం ఎక్కిన తర్వాత విస్మరించిన కాంగ్రెస్ రంగానికి రోజులు దగ్గర పడ్డాయని బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నిప్పులు చెరిగారు.

ఇంతకుముందు ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క! కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు" నెరవేర్చకపోతే గద్దె దింపుదాం అని ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆరు గ్యారెంటీలను పాతరేసి, 420కు పైగా హామీలను బొందపెట్టిన తీరుకు నిరసనగా అద్దరి వెంకటాపురంలో బిఆర్ఎస్ శ్రేణులు ప్రజా క్షేత్రంలోకి దిగాయి. మండల పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు నరసింహమూర్తి నాయకత్వంలో సుమారు 200 బైక్‌లతో చేపట్టిన భారీ నిరసన ర్యాలీ పరిసర ప్రాంతాలను హోరెత్తించింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలన ప్రజా కంటకంగా మారిందని, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులను నమ్మించి గొంతు కోశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల పేరుతో ప్రజలను గారడీ చేస్తూ కాలయాపన చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిందేమీ లేదని ప్రతి పథకాన్ని కళ్లకు కడుతూ ఎండగట్టారు.

కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు, ప్రజల తరఫున బిఆర్ఎస్ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ నయవంచనను వీధివీధినా ఎండగడతామని భవిష్యత్ కార్యాచరణకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోధబోన బుచ్చయ్య , వాజేడు మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి , కాకులమర్రి ప్రదీప్ రావు , తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, ఎండి వలి బాబా, ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు, బిఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ వైఖరిపై నిరసన తెలిపారు.

# 22ఏ భూముల సమస్యపై బీజేపీ దీక్షకు ములుగు జిల్లా నాయకుల సంఘీభావం

**చలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ములుగు జిల్లా బీజేపీ నాయకులు**



ములుగు, సెప్టెంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రైవేటు భూములను సైతం నిషేధిత 22ఏ జాబితాలో చేర్చడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తమ భూములపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రైవేటు భూములను నిషేధిత 22ఏ జాబితాలో చేర్చి, వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. అర్హత ఉన్న ప్రైవేటు భూములను ఎటువంటి షరతులు లేకుండా 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ఒకరోజు దీక్షకు మద్దతుగా, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ములుగు జిల్లా బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు.

ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన దీక్షలో పాల్గొని రాష్ట్ర పార్టీ చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ప్రజల భూములు, ఆస్తుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, 22ఏ జాబితాలో అన్యాయంగా చేర్చిన ప్రైవేటు భూములను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.22ఏ నిషేధిత జాబితా సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, భూ యజమానులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ప్రజల భూ హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి, జిల్లా ఉపాధ్యక్షులు అల్లె శోభన్, భర్తాపురం నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, జిల్లా కార్యదర్శులు లింగంపల్లి శ్రీనివాస్, తోటకూరి మధు, గంగిశెట్టి రాజ్ కుమార్, మండల అధ్యక్షులు పైడాకుల మల్లేశ్, మార్క సతీష్, తాల్లపల్లి లక్ష్మణ్, వినుకోల్ల చక్రవర్తి, కిసాన్ మోర్చా అధ్యక్షులు జాడి రామరాజు, సిద్ధం బోయిన సురేందర్, దండిగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించి, తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తమకు నిత్యం మంచి చెడులు తెలియజేస్తూ, ఉన్నతమైన భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తున్న గురువులకు విద్యార్థులు శాలువాలు కప్పి, ప్రత్యేక బహుమతులు అందించి ఘనంగా సత్కరించారు.పాఠశాల కరస్పాండెంట్ బుర ఉమా రమేష్ మాట్లాడుతూ... విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో, వారి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడమే గురువులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కిడ్స్ కాన్వెంట్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి, టీచర్స్ డే దినోత్సవ వేడుకలు

**చిన్ని కృష్ణులు, గోపికమ్మలుఉట్టి కొట్టి సందడి-సాంప్రదాయ వేషధారణలో చిన్నారుల కృష్ణాష్టమి సంబరాలు**



వేములవాడ, సెప్టెంబర్ 5 వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో కృష్ణాష్టమి, టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంప్రదాయ దుస్తుల్లో వచ్చిన చిన్నారులు ఉట్టి కొట్టి, నృత్యాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్ నరాల దేవేందర్ మాట్లాడుతూపిల్లలందరితో కలిసి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు సైతం సాంప్రదాయ వేషధారణలో పాల్గొని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ దరక్షన్ వసూపియా మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేస్తూ ఇలాంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు టీచర్స్ ని శాలువా తో సన్మానం చేసి వారి గురుభక్తిని చాటుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే..

## -సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్



హైదరాబాద్, సెప్టెంబర్ 5:ఉపాధ్యాయులు సమాజానికి మార్గనిర్దేశకులని, విద్యార్థులను ఉన్నతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎంతో కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లే తొలి గురువు అని, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని సీపీ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నా యని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సీపీ తెలిపారు. మహిళలు, బాలికల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాల్లో పోలీసులతో కలిసి ఉపాధ్యాయులు కూడా కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారడమే ఉపాధ్యాయులకు అందించే గొప్ప బహుమతి అని అన్నారు. అనంతరం విద్యార్థులతో సీపీ ముఖాముఖి నిర్వఏం వారి సందేహాలు, సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఆయా అంశాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థి జూడ్ అడిగిన ప్రశ్నకు స్పందించిన సీపీ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. వాహనదా లు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. మహిళలు, బాలికల భద్రతపై విద్యార్థిని స్నేహిత అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే 100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగంపై కొందరు విద్యార్థులు సీపీ దృష్టికి సమస్యను తీసుకు వచ్చారు. పాఠశాలకు వచ్చే మార్గంలో కొందరు వ్యక్తులు మాదకద్రవ్యాలు సేవిస్తున్నట్లు కనిపిస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన సీపీ.. మాదకద్రవ్యాల వినియో విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు స్నేహితులను కూడా వాటికి దూరంగా ఉంచేలా చైతన్యపరచాలని కోరారు. రోడ్డు దాటే సమయంలో అవసరమైతే సమీపంలోని ట్రాఫిక్ పోలీసుల సహాయం తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

సైబర్ మోసాలపై విద్యార్థి నిఖిల్ అడిగిన ప్రశ్న కూడా కార్యక్రమంలో ప్రాధాన్యం సంతరించుకుంది. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి వన్‌టైమ్ పాస్‌వర్డ్ అడగడంతో చెప్పిన వెంటనే తన ఖాతా నుంచి రూ.4 వేలు డెబిట్ అయ్యాయని అతడు సీపీకి వివరించాడు. దీనిపై డా. ఎం. రమేష్ స్పందిస్తూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి వన్‌టైమ్ పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమం ముగింపులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌లను సీపీ డా. ఎం. రమేష్ ప్రత్యేకంగా సన్మానించారు. వారి సేవలను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ భూపతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ ఉద్యోగాల్లో స్థానికులకు అన్యాయం

**వేరే ప్రాంతాల వారికి మంత్రుల సిఫారసులతో కొలువులా**

**బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులు, యువత, నిరుద్యోగులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వేరే ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడలో 'నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ వెయ్యి రోజుల దగాపై పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి త్రినేత్ర ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.చల్మెడ మాట్లాడుతూ ఎన్నికల ముందు తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రతి ఏడాది నియామక క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లాలో 4 వేల మందికి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. నిరుద్యోగుల తరఫున ప్రశ్నించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు లేదా అని ప్రశ్నించారు.రాజన్న ఆలయంలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి మంత్రుల సిఫారసులతో ఉద్యోగాలు ఇస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ ప్రాంత యువత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.విద్యార్థులు మాట్లాడుతూ రూ.5 లక్షల విద్యా భరోసా, సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజుల భారం తగ్గింపు, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధికి ఆర్థిక సాయం వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. చదువు విద్యార్థులకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత వాటిని విస్మరించిందని చల్మెడ విమర్శించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగుల భవిష్యత్‌తో చెలగాటం ఆపి ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, మానక ల రవి, వెంగళ శ్రీకాంత్, గోస్కుల రవి, అంజద్ పాషా , తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5(నేటినిజం ప్రతినిధి): కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా బ్యాడ్జ్‌ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్టూడెంట్ కౌన్సిల్ లీడర్స్, 1, 2, 3వ ర్యాంకర్లు, సబ్జెక్ట్ టాపర్స్, స్టార్ రైటర్స్, స్టార్ రీడర్స్, స్పీకింగ్ స్క్వాడ్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బ్యాడ్జ్‌లు అందజేసి అభినందించారు.పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కృషిని అభినందించారు. ప్రిన్సిపాల్ వెంకటేష్ ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువులో రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు తదితర కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఆనందోత్సాహాల మధ్య ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం

**రేవంత్ సర్కార్ రాజీనామా చేయాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



కరీంనగర్, సెప్టెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి) :కరీంనగర్‌లో బీఆర్ఎస్ యువ సమరభేరిరేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలుకరీంనగర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు.ఉద్యోగాల విషయంలో యువతను మోసం చేశారని, నోటిఫికేషన్లకు బదులు 'లూటిఫికేషన్లు' కొనసాగుతున్నాయని విమర్శించారు. ఉద్యోగాలు అడిగే యువతపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ.. ఎక్కడున్నావు, హైదరాబాద్‌కు ఎందుకు రావనీ ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. పరిపాలన గాడి తప్పిందని విమర్శిస్తూ, హామీలు అమలు చేయలేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కరిని బర్తరఫ్ చేయడం కాదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే బర్తరఫ్ అవుతుందని వ్యాఖ్యానించారు.సభలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు, యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**బీఆర్ఎస్ నేత చల్మెడ నరసింహారావు**

**విద్యార్థులు, యువతతో ర్యాలీ**




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 5(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని అన్నారు. శుక్రవారం తెలంగాణ తల్లికి పూలమాల వేసి విద్యార్థులు, యువతతో కలిసి ర్యాలీ నిర్వహించారు.రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మెగా డీఎస్సీని వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరుద్యోగ భృతి కింద 33 నెలలకు ఒక్కో నిరుద్యోగికి రూ.1.32 లక్షలు బకాయి పడ్డాయని ఆరోపిస్తూ, ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుద్రంగిలో రూ.45 కోట్లతో ఏటీసీ ఏర్పాటు చేస్తామని భూమిపూజ చేసినా పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.రాజన్న ఆలయంలో స్థానిక నిరుద్యోగులను కాదని ఇతర జిల్లాల వారికి కాంట్రాక్టు ఉద్యోగాలు కల్పిస్తున్నారంటూ ఆరోపించారు. విద్యార్థులు, యువత హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని చల్మెడ స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఏనుగు మనోహర్‌రెడ్డి, రామతీర్థపు మాధవిరాజు, నిమ్మ శెట్టి విజయ్, గోస్కుల రవి, ఏనుగు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వెంగల అనిత, శ్రీకాంత్‌గౌడ్, వాసాల లావణ్య, అంజద్ పాషా, సయ్యద్ ఉమర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.